



# మన దునియా

Our News Our World

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం



రిపోర్టర్లు కావలెను

మన దునియా

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 239 | మార్చ్ 16 సోమవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# ఫామ్ హౌస్‌లో డ్రగ్స్ పార్టీ గుట్టురట్టు..

# 11 మంది అరెస్ట్

బీఆర్ఎస్ నేత రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్‌లో డ్రగ్స్ పార్టీ

ఫామ్‌హౌస్ వద్ద కాల్పులు

లగ్జరీ ఫామ్ హౌస్‌లో రహస్య డ్రగ్స్ పార్టీ బయటపడింది

పోలీసుల దాడితో బట్టబయలైన మద్యం, డ్రగ్స్ వినియోగం

పార్టీలో పాల్గొన్న 11 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఫామ్ హౌస్ వద్ద కాల్పుల కలకలం... రివాల్వర్ స్వాధీనం

డ్రగ్ టెస్టుల్లో ఆరుగురికి పాజిటివ్

విదేశీ మద్యం, కొకైన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు

డ్రగ్స్ సరఫరా చేసిన వ్యక్తిపై పోలీసుల ఆరా

మొయినాబాద్ ఘటన తెలంగాణలో సంచలనం

ఫామ్ హౌస్ పార్టీలో బయటపడిన డ్రగ్స్ ముఠా



## మూసి ప్రాజెక్టుపై వ్యతిరేకత బీఆర్ఎస్‌కు మైనస్సే!

**మన దునియా,హైదరాబాద్: మార్చి15**



మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై బీఆర్ఎస్ అవలంబిస్తున్న ప్రస్తుత వ్యూహం రాజకీయంగా కత్తి మీద సాములా మారింది. బీఆర్ఎస్ నాయకత్వం తాము మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని, కేవలం కూల్చివేతలకే వ్యతిరేకమని పదేపదే స్పష్టం చేస్తోంది. అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నాలు నగర అభివృద్ధిని అడ్డుకుంటున్నారనే ముద్ర పడేలా చేసే ప్రమాదం ఉంది. గతంలో తాము కూడా మూసీ సుందరీకరణ కోసం సుమారు రూ. 16,000 కోట్లతో ప్రణాళికలు రూపొందించామని కేటీఆర్ గుర్తు చేస్తున్నప్పటికీ, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన రూ.1.5 లక్షల కోట్ల ప్రణాళికకను గాంధీ సరోవర్ వంటి భారీ నిర్మాణాలను బీఆర్ఎస్ తీవ్రంగా విమర్శిస్తోంది.

**ప్రజా వ్యతిరేకత వచ్చే అవకాశం ఎక్కడ?**

## స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాసిన ప్రధాని మోదీ

**మన దునియా,న్యూఢిల్లీ:మార్చి 15**



స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాసిన ప్రధాని మోదీ స్పీకర్ ఓం బిర్లాకు ప్రధాని మోదీ లేఖ రాశారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ.. 'ప్రధానమంత్రి గారు మీ లేఖ అందింది. భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం లోని నియమాలు, విధానాల పట్ల మీకు ఎప్పుడూ అచంచలమైన విశ్వాసం ఉందని ఈ లేఖ తెలియజేస్తోంది. మీరు ప్రజా జీవితంలో అనుసరించిన నైతిక విలువలను ఈ లేఖ ప్రతిబింబిస్తుంది' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు

## చేతి వేళ్లు చూపిస్తూ... తన మరణ వదంతులను కొట్టిపారేసిన నెతన్యాహు




ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తన మరణంపై వ్యాపిస్తున్న వదంతులను స్వయంగా ఖండించారు. ఇరాన్ దాడుల్లో తాను చనిపోయినట్లు వస్తున్న వార్తలకు చెక్ పెడుతూ ఓ కొత్త వీడియోను విడుదల చేశారు. ఇందులో ఆయన తన చేతిని చూపిస్తూ, "నాకు ఐదు వేళ్లే ఉన్నాయి" అని చెప్పి, ఇటీవలి వీడియోలో ఆరు వేళ్లు ఉన్నాయన్న ప్రచారాన్ని కూడా సరదాగా కొట్టిపారేశారు.ఓ కాఫీ షాపులో కాఫీ ఆర్డర్ చేస్తూ కనిపించిన

## ఆధారాలు బయటపెడితే నన్ను బదనాం చేస్తారా..

### రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కవిత ధ్వజం

**మన దునియా,హైదరాబాద్ మార్చి15**

సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ బ్యాంక్‌కు మూసీ పరివాహక ప్రాంత భూములను కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈరోజు(ఆదివారం) హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. ఇప్పటివరకు మూసీపై కాంగ్రెస్ ప్రభుత్వం డీపీఆర్‌ను ఎందుకు విడుదల చేయట్లేదని ప్రశ్నించారు. ఫేజ్- వన్‌కి సంబంధించిన డీపీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం చూపెట్టిందని ప్రస్తావించారు. పూర్తి డీపీఆర్ ఇవ్వకపోవడం వెనుక మోసం ఉందని ఆరోపించారు.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# మూసి ప్రాజెక్టుపై వ్యతిరేకత బీఆర్ఎస్‌కు మైనస్సే!

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ నగరం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో మూసీ కాలుష్యం ఒకటి. దీన్ని పరిష్కరించడం ద్వారా నగరం ప్రపంచ స్థాయికి చేరుకుంటుందని మెజారిటీ ప్రజలు నమ్ముతున్నారు. ఇలాంటి సమయంలో పనుల్ని వ్యతేరికించడం, కోర్టులు, రాజకీయ ఉద్యమాలతో పనులు ఆపేసేలా వ్యహరిస్తే.. పనులు ఆగిపోవడానికి విపక్షమే కారణమని ప్రభుత్వం గట్టిగా ప్రచారం చేస్తే, అది బీఆర్ఎస్‌కు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. ప్రత్యేకించి మధ్యతరగతి , ఎగువ మధ్యతరగతి ప్రజల్లో అభివృద్ధిని అడ్డుకుంటున్నారు అనే భావన కలిగితే పార్టీకి ప్రతికూల అంశంగా మారుతుంది.

**వ్యూహాత్మక మార్పు అవసరమా?**

ప్రాజెక్టును సమూలంగా వ్యతిరేకించడం కంటే, దాని అమలులో జరుగుతున్న జాప్యం, ప్రాజెక్టు రిపోర్ట్ లేకపోవడం , నిర్వాసితుల పునరావాసం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయడమే మేలైన వ్యూహం అన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇప్పటికే హరీష్ రావు వంటి నేతలు ప్రభుత్వానికి స్పష్టమైన పాలసీ లేదు అని ప్రశ్నిస్తూనే, మురికి నీటిని ఆపడంపై దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. అభివృద్ధిని కాదని కాకుండా, అభివృద్ధి వెనుక ఉన్న లోపాలను ఎత్తిచూపడం ద్వారానే ఎక్కువ రాజకీయ ప్రయోజనం పొందుతుంది. కానీ ఈ ప్రయత్నాలను కూడా కాంగ్రెస్ ఎప్పుడూ.. అడ్డుకునే ప్రయత్నమే అంటుంది. వాటిని కూడా రాజకీయ వ్యూహంతోనే తిప్పికొట్టాల్సి ఉంటుంది.

రాజకీయ సవాలు

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకుని, లండన్, సింగపూర్ నమూనాలను ఉదాహరణగా చూపుతూ ప్రజల్లో ఆశలు రేకెత్తిస్తోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ కేవలం కూల్చివేతల చుట్టూనే తన రాజకీయాన్ని తిప్పితే, భవిష్యత్తులో నగరాభివృద్ధికి ఆటంకకారిగా ముద్రపడే ప్రమాదం ఉంది. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి, పనుల నాణ్యతను , వేగాన్ని ప్రశ్నించడం ద్వారా మాత్రమే బీఆర్ఎస్ తన రాజకీయ వ్యూహాన్ని అమలు చేయడం ద్వారా.. ప్రజల్లో వ్యతిరేకత పెరగకుండా చూసుకోవచ్చని అంచనా వేస్తున్నారు.

# చేతి వేళ్లు చూపిస్తూ... తన మరణ వదంతులను కొట్టిపారేసిన నెతన్యాహు

(మొదటి పేజీ తరువాయి)




నెతన్యాహు, తన మరణవార్తలపై వ్యంగ్యంగా స్పందించారు. “తనకేమీ కాలేదని, ప్రాణాలు పోయినా తన దేశాన్ని ప్రేమిస్తూనే ఉంటానని అన్నారు. ఈ క్లిష్ట సమయంలో ఇజ్రాయెల్ ప్రజల ధైర్యాన్ని ఆయన ప్రశంసించారు. ఇటీవల ఇరాన్ జరిపిన దాడుల్లో నెతన్యాహు మరణించారంటూ సోషల్ మీడియాలో తీవ్రంగా ప్రచారం జరిగింది. దీనిపై ఆయన కార్యాలయం గతంలోనే స్పందించి, అవన్నీ అసత్యాలని, ప్రధాని క్షేమంగా ఉన్నారని ప్రకటించింది. ఇప్పుడు నెతన్యాహు స్వయంగా వీడియో ద్వారా స్పష్టత ఇచ్చారు.మరోవైపు, ఇజ్రాయెల్ ప్రధానిని వెంటాడి అంతమొందిస్తామని ఇరాన్ మిలిటరీ ఆదివారం హెచ్చరించింది. చిన్నారుల మృతికి కారణమైన నెతన్యాహును వదిలిపెట్టేది లేదని స్పష్టం చేసింది. గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వదంతులు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తన ఆరోగ్యం, భద్రతపై వస్తున్న ఊహాగానాలకు నెతన్యాహు ఈ వీడియోతో ముగింపు పలికినట్లయింది.

# ఆధారాలు బయటపెడితే నన్ను బదనాం చేస్తారా..

ఫ్రీ ఫీజబులిటీ రిపోర్టులో రూ.5,641 కోట్లు ఖర్చు అవుతుందని ఈ ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు.

**మూసీపై ప్రజెంటేషన్‌కు ఎందుకు పిలవలేదు..**

ఆరు నెలల తర్వాత దాదాపు రూ.1400 కోట్ల అంచనా ఎందుకు పెరిగిందని కవిత నిలదీశారు. జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి ఎంత ఖర్చు అవుతుందో.. ఆ ఖర్చు మొత్తం సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి నుంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్టు ప్రజెంటేషన్‌కు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు, మంత్రులను పిలిచారని అన్నారు. కానీ మూసీలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులను ప్రజెంటేషన్‌కు ఎందుకు పిలవలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణలో చిన్న మోదీలా.. రేవంత్‌రెడ్డి వ్యవహారం ఉందని ఎద్దేవా చేశారు. మూసీ పేరుతో సీఎం గ్రాఫిక్స్ చూపెట్టారని సెటైర్లు గుప్పించారు. 16 నాలాల నుంచి మూసీలోకి మురుగు నీరు వస్తోందని చెప్పుకొచ్చారు. నగరంలో ఉన్న వ్యర్థాలన్నీ మూసీలోకి వెళ్తున్నాయని తెలిపారు.

**అరాచకం చేస్తున్నారు..**

హైడ్రాతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి అరాచకం చేస్తున్నారని కవిత ఆగ్రహించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఇప్పటివరకు ఆరు ఫిర్యాదులు చేశామని ప్రస్తావించారు. హైడ్రా కమిషనర్, ప్రభుత్వంపై పరువు నష్టం దావా వేస్తానని అన్నారు. నాలాలు ఆక్రమించి విల్లాలు కడుతున్న సంస్థ తమ పరిధిలోకి రాదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఎలా చెబుతున్నారని ఫైర్ అయ్యారు. సిగ్గు లేకుండా రంగనాథ్ హైడ్రా వీడియోలు తీసి పెడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇష్టం వచ్చినట్లుగా వీడియోలు పెడుతున్నారని.. మీరేమైనా కంటెంట్ రైటర్లా ...? అని ధ్వజమెత్తారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం బాయిలో దూకాలి..**

తాను ఆధారాలు బయటపెడితే హైడ్రా, కాంగ్రెస్ ప్రభుత్వం బాయిలో దూకాలని కవిత ఎద్దేవా చేశారు. తాను ఆధారాలు బయటపెడితే ఈ ప్రభుత్వం, ప్రతిపక్షం కలిసి తనను బదనాం చేస్తారా...?, తమాషాలు చేస్తున్నారా..? అని ఆగ్రహించారు. హైడ్రా పెట్టిన ట్వీట్స్ వెంటనే డిలీట్ చేయాలని.. లేకపోతే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. తెలంగాణలో రియల్ ఎస్టేట్ ప్రభుత్వం నడుస్తోందని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలోని వెలుగుమట్లలో అసలైన బాధితులకు ఇళ్ల పట్టాలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. అందులో కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలకు ఇచ్చారనే విషయం తమ దృష్టికి వచ్చిందని అన్నారు. త్వరలో వెలుగుమట్లలో పర్యటిస్తానని కవిత స్పష్టం చేశారు..

# ఫామ్ హౌస్‌లో డ్రగ్స్ పార్టీ గుట్టురట్టు.. 11 మంది అరెస్ట్

**మన దునియా,రంగారెడ్డి జిల్లా మొయినాబాద్:మార్చి 15**

రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్‌లో జరిగిన ఫామ్ హౌస్ పార్టీపై పోలీసులు నిర్వహించిన సోదాలు తెలంగాణ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. డ్రగ్స్ వినియోగం, విదేశీ మద్యం, అలాగే పోలీసులపై కాల్పులు జరిగాయని ఆరోపణలు రావడంతో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు మొత్తం 11 మందిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ముఖ్యంగా డ్రగ్స్ వినియోగం బయటపడటంతో ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

**ఫామ్‌హౌస్‌పై పోలీసుల దాడి...**

మొయినాబాద్ ప్రాంతంలోని పంజుగుల రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్‌లో లగ్జరీ పార్టీ జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులు అక్కడికి వెళ్లిన సమయంలో ఫామ్ హౌస్‌లో భారీ పార్టీ జరుగుతున్నట్లు గుర్తించారు. స్విమ్మింగ్ పూల్ వద్ద ప్రత్యేకంగా పార్టీ ఏర్పాటు చేసి మద్యం సేవిస్తున్నట్లు అధికారులు దర్యాప్తులో తేలింది. పార్టీలో పాల్గొన్న వారిలో మొత్తం 10 మంది పురుషులు, ఒక మహిళ ఉన్నట్లు మొయినాబాద్ పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ నయీముద్దీన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు తనిఖీలు నిర్వహించగా డ్రగ్స్, విదేశీ మద్యం వినియోగించినట్లు ఆధారాలు లభించాయి.

**పోలీసులపై కాల్పుల ఆరోపణ..**

ఈ ఘటనలో మరో సంచలన అంశం బయటపడింది. పోలీసులు ఫామ్‌హౌస్ వద్దకు వెళ్లిన సమయంలో కాల్పులు జరిగాయని సబ్‌ఇన్‌స్పెక్టర్ నయీముద్దీన్ తన ఫిర్యాదులో ప్రస్తావించారు. కాల్పుల ఘటన నేపథ్యంలో పోలీసులు ఫామ్ హౌస్‌ను పూర్తిగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా జర్మనీకి చెందిన 32వ రివాల్వర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఒక లైవ్ రౌండ్, నాలుగు ఖాళీ కార్ట్రిడ్జ్‌లను కూడా పోలీసులు సీజ్ చేశారు. ఈ అంశం కేసును మరింత తీవ్రంగా మార్చింది.

**డ్రగ్స్ స్వాధీనం..**

పార్టీలో పాల్గొన్న వ్యక్తుల నుంచి డ్రగ్స్ కూడా స్వాధీనం చేసుకోవడం సంచలనంగా మారింది. ముఖ్యంగా డ్రైవర్ సిల్వరి శరత్ కుమార్ వద్ద నుంచి కొకైన్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న కొకైన్ బరువు 0.26 గ్రాములు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో బెంగళూరుకు చెందిన ఓ అడ్వకేట్ ఈ డ్రగ్స్ తీసుకువచ్చారు. అతడే పార్టీకి డ్రగ్స్ సరఫరా చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

**డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్..**




పార్టీలో పాల్గొన్న వారికి డ్రగ్ పరీక్షలు నిర్వహించగా ఆరుగురికి పాజిటివ్ వచ్చినట్లు ఈగల్ ఎస్పీ వెల్లడించారు. ఈ కేసులో మొత్తం 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ లో పలువురు నిందితుల పేర్లను చేర్చారు. వీరందరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

**విదేశీ మద్యం స్వాధీనం..**

పార్టీలో భారీగా విదేశీ మద్యం వినియోగించినట్లు పోలీసులు గుర్తించారు. ఫామ్‌హౌస్‌లో నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 48 బీర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అదనంగా ఖరీదైన విదేశీ మద్యం బ్రాండ్ల బాటిళ్లను కూడా పోలీసులు సీజ్ చేశారు. స్విమ్మింగ్ పూల్ వద్ద ప్రత్యేకంగా పార్టీ ఏర్పాటు చేసి వీటిని వినియోగించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

**ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు..**

డ్రగ్స్ స్వాధీనం కావడం, డ్రగ్ పరీక్షల్లో పాజిటివ్ రావడం వంటి అంశాల కారణంగా పోలీసులు (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్) చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ చట్టం కింద డ్రగ్స్ వినియోగం, నిల్వ, సరఫరా వంటి అంశాలకు కఠిన శిక్షలు విధించనున్నారు.

**డ్రగ్స్ సరఫరాపై ఆరా..**

ఈ కేసులో మరిన్ని అంశాలు బయటపడే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి, ఎవరు సరఫరా చేశారు, మరెవరైనా ఇందులో భాగస్వాములు ఉన్నారా అనే విషయాలపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. పార్టీ నిర్వహణ, ఆయుధం వినియోగం, డ్రగ్స్ వినియోగం వంటి అంశాలన్నింటినీ పోలీసులు సమగ్రంగా పరిశీలిస్తున్నారు. అవసరమైతే మరిన్ని అరెస్టులు కూడా జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు..

# ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా బ్రతికే ఉన్నాడు.. కానీ కదలలేని స్థితిలో! భారత ఇంటెలిజెన్స్ సంచలన నివేదిక!

ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ బ్రతికే ఉన్నప్పటికీ, తీవ్ర గాయాలతో కదలలేని (ఇమ్మొబైల్) స్థితిలో ఉన్నారని భారత ఇంటెలిజెన్స్ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో ఓ కథనం వెలువడింది. ఆయన సంభాషణలు, బహిరంగ ప్రకటనలన్నీ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) కట్టుదిట్టమైన నియంత్రణలో ఉన్నాయని ఆ కథనం స్పష్టం చేసింది. ఈ పరిణామం ఇరాన్ నాయకత్వంపై, దేశ స్థిరత్వంపై అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళనలకు దారితీస్తోంది.భారత ప్రభుత్వానికి చెందిన అత్యంత విశ్వసనీయ ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం ప్రకారం... ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో అప్పటి సుప్రీం లీడర్, మొజ్తబా తండ్రి అయిన అయతుల్లా అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. ఇదే దాడుల్లో మొజ్తబా ఖమేనీ తీవ్రంగా గాయపడ్డారు. ఆ గాయాల కారణంగా ఆయన ప్రస్తుతం కదలలేని స్థితిలో ఉన్నారు. దీంతో దేశంలో అస్థిరత ఏర్పడకుండా ఉండేందుకు ఐఆర్జీసీ రంగంలోకి దిగింది. మొజ్తబాతో పరిమిత సంప్రదింపులు జరుపుతూ, ఆయన పేరుతో సందేశాలను, సోషల్ మీడియా పోస్టులను అత్యంత జాగ్రత్తగా రూపొందించి విడుదల చేస్తోంది. దేశంలో అంతా సవ్యంగా ఉందనే భావన కల్పించేందుకే ఐఆర్జీసీ ఈ చర్యలు చేపడుతోందని నివేదిక పేర్కొంది.ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఈ నివేదికకు బలాన్నిస్తున్నాయి. ఖమేనీ బ్రతికే ఉన్నారని, కానీ దాడుల్లో తీవ్రంగా గాయపడి రూపురేఖలు మారిపోయి ఉండొచ్చని ట్రంప్ వ్యాఖ్యానించారు. దీనికి తోడు, సుప్రీం లీడర్‌గా తన సొంత ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కూడా మొజ్తబా ఖమేనీ హాజరు కాలేదు. వేదికపై కేవలం ఆయన ఫోటోను మాత్రమే ప్రదర్శించడం ఆయన ఆరోగ్య పరిస్థితిపై నెలకొన్న ఊహాగానాలకు మరింత ఆజ్యం పోసింది.అయితే, ఈ ఆరోపణలను ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ తీవ్రంగా ఖండించారు. మొజ్తబా ఖమేనీ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని, ఇవన్నీ అమెరికా సృష్టిస్తున్న అసత్య ప్రచారాలని కొట్టిపారేశారు. కానీ, క్షేత్రస్థాయి పరిస్థితులు, భారత ఇంటెలిజెన్స్ నివేదిక మాత్రం పరిస్థితి తీవ్రంగానే ఉందని సూచిస్తున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, ఇరాన్‌లో నెలకొన్న ఈ నాయకత్వ సంక్షోభం పశ్చిమాసియా రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. ప్రస్తుతం తాత్కాలికంగా ఐఆర్జీసీయే పాలనా వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
మార్చ్ । సోమవారం । 16 । 2026



# రబి సీజన్ ధాన్యం సేకరణకు సమగ్రంగా సిద్ధం కావాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**మన దునియా,వరంగల్:మార్చి 15**

రాబోయే రబి సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు ముందస్తు సన్నాహాలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు.ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలిసి పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖల అధికారులతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రబి 2025--26 ధాన్యం సేకరణ, 2024--25 సీఎంఆర్ డెలివరీ, ప్రజా పంపిణీ వ్యవస్థ అమలు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ల నుండి బ్యాంక్ గ్యారంటీ పత్రాల సమర్పణ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించి అవసరమైన సూచనలు చేశారు.జిల్లాలో 2025--26 రబి సీజన్‌లో సుమారు 2 లక్షల 10 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు అయ్యే అవకాశముందని అంచనా ఉన్న నేపథ్యంలో, రైతులకు ఇబ్బందులు కలగకుండా సుమారు 240 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, అలాగే 2024--25 రబి సీఎంఆర్‌ను 100 శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఖరీఫ్ 2025-26 సీఎం ఆర్ డెలివరీ వేగవంతం చేయాలన్నారు. గోదాముల్లో ధాన్యం నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు.రైస్ మిల్లర్ల నుండి బ్యాంక్ గ్యారంటీ పత్రాలను తప్పనిసరిగా సేకరించాలని, రాబోయే ఏప్రిల్ రెండవ వారంలో రబి ధాన్యం కొనుగోలు ప్రారంభం అయ్యే అవకాశం ఉన్నందున మార్కెటింగ్ శాఖ ద్వారా అవసరమైన టార్పాలిన్లు, మాయిశ్చర్




మీటర్లు, వేయింగ్ మిషన్లు, ప్యాడీ క్లీనర్లు, డ్రయర్లు తదితర సామగ్రిని ముందుగానే సమకూర్చుకుని సిద్ధంగా ఉండాలని సూచించారు.ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా అవుతున్న బియ్యం ఎలాంటి దుర్వినియోగం జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్డీఓ రామ్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా మేనేజర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి మనోహర్, జిల్లా కోఆపరేటివ్ అధికారి నీరజ, సంబంధిత శాఖల అధికారులు, జిల్లాలోని రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు రవీందర్, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అదే ఫామ్ హస్: నాడు ఎమ్మెల్యేల కొనుగోలు..నేడు డ్రగ్స్ పార్టీ!

**మన దునియా,మొయినాబాద్: మార్చి 15**

మొయినాబాద్‌లోని పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్ మరోసారి వార్తల్లో నిలిచింది. గతంలో ఎమ్మెల్యేల కొనుగోలు వివాదంతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన అదే ప్రాంగణం, ఇప్పుడు డ్రగ్స్ పార్టీ, కాల్పుల కలకలం తో మళ్లీ హాట్ టాపిక్ అయింది.

**నాడు రాజకీయ ప్రకంపనలు -- ఎమ్మెల్యేల కొనుగోలు కేసు**


గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇదే ఫామ్‌హౌస్ వేదికగా జరిగిన ఎమ్మెల్యేల కొనుగోలు ఉదంతం అప్పట్లో పెను సంచలనం సృష్టించింది. రోహిత్ రెడ్డి ఫిర్యాదుతోనే పోలీసులు అక్కడ సోదాలు నిర్వహించి, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అప్పట్లో ఈ కేసు జాతీయ రాజకీయాల్లో కూడా పెద్ద దుమారం రేపింది. ఆ ఘటనతో రోహిత్ రెడ్డి పేరు ఒక్కసారిగా వెలుగులోకి రావడమే కాకుండా, విచారణ సంస్థల చుట్టూ తిరిగేలా చేసింది.

**నేడు డ్రగ్స్ పార్టీ -- రివర్స్ సీన్**

అప్పట్లో ఫిర్యాదుదారుడిగా ఉన్న రోహిత్ రెడ్డి, ఇప్పుడు అదే ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీలో ప్రధాన నిందితుడిగా మారడం గమనార్హం. ఈసారి ఈగల్ టీమ్ నిర్వహించిన మెరుపు దాడుల్లో స్వయంగా రోహిత్ రెడ్డికే డ్రగ్స్ పాజిటివ్ వచ్చినట్లు వార్తలు రావడం ఆయన రాజకీయ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోంది. గతంలో పోలీసులకు సహకరించిన అదే ప్రాంగణంలో, ఈసారి పోలీసులపైనే కాల్పులు జరగడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

**ఒకే వేదిక.. వేర్వేరు వివాదాలు**

ఒకప్పుడు రాజకీయ కుట్రలకు కేంద్రంగా ప్రచారంలోకి వచ్చిన ఈ ఫామ్‌హౌస్, ఇప్పుడు డ్రగ్స్ కల్చర్‌కు చిరునామాగా మారింది. గతంలో



ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టే ప్రయత్నాలు జరిగాయని ఆరోపణలు వస్తే, ఇప్పుడు ప్రముఖ రాజకీయ నేతలు, ఇతర రాష్ట్రాల ఎమ్మెల్యేల సమక్షంలో నిబంధనలకు విరుద్ధంగా పార్టీ నిర్వహించడం చర్చనీయాంశమైంది. రెండు ఘటనల్లోనూ సాక్ష్యాల ధ్వంసం అనే అంశం ఉమ్మడిగా కనిపిస్తోంది.

**బయటకు తెలియనివి ఇంకెన్ని జరిగాయో?**

గతంలో జరిగిన ఘటన రాజకీయ పోరాటంగా సాగితే, ప్రస్తుత ఘటన నేరపూరిత కోణంలో సాగుతోంది. పోలీసులపై కాల్పులు జరగడం, ఆయుధ చట్టం ఉల్లంఘన వంటివి ఉండటంతో ఈ కేసు రోహిత్ రెడ్డికి గత కేసు కంటే ఎక్కువ ఇబ్బందులు తెచ్చిపెట్టేలా ఉంది. బయటపడినవే ఇలాంటి సంచలనాలు ఉంటే..బయటపడకుండా.. ఇంకెన్ని జరిగాయోనని గుసగుసలు వినిపిస్తున్నాయి.

# నేడు (సోమవారం )సూర్యాపేటలో హోటల్స్ బంద్

**మన దునియా,సూర్యాపేట: మార్చి 15**

సూర్యాపేట: పట్టణంలోని అన్ని రకాల హోటల్స్ , మిర్చి బండ్లు, ఇడ్లి బండ్లు, టీ స్టాల్స్, కర్రి పాయింట్లు, బిర్యాని సెంటర్లు, బేకరీలు, సోమవారం నాడు ఒక్క రోజు హోటల్స్ బంద్ నిర్వహిస్తున్నామని ఈ బంద్ కు ప్రజలు సహకరించాలని సూర్యాపేట పట్టణ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు పానుగంటి శ్రీనివాస్, పెట్టి వెండర్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులు బిల్లకంటి జానకి రాం ( బ్లూసి జాని) అన్నారు. జిల్లా కేంద్రం లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పశ్చిమాసియాలో యుద్ధం మూలంగా సూర్యాపేట పట్టణంలో కమర్షియల్ గ్యాస్ దొరకడం లేదని అంతేకాకుండా అధికారులు హోటల్స్ పై దాడులు చేస్తున్నారని తాము హోటల్స్ నడపలేని దుస్థితి ఏర్పడిందని అన్నారు. సూర్యాపేట పట్టణం లోని 150 హోటల్స్ లో 1500మంది పని చేస్తున్నారని, ప్రస్తుత పరిస్థితులలో వారికి ఉపాధి పోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తమకు కమర్షియల్ గ్యాస్ సప్లై చేయాలని, హోటల్స్ పై దాడులు నిలిపివేయాలని వారు తెలిపారు. సోమవారం నాడు జరిగే బంద్ లో టిఫిన్ సెంటర్లు, టీ స్టాల్ తో పాటు అందరు యజమాలు కూడా పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో హోటల్ యజమానులు మేడి పవన్, విశాల్, రమేష్, మొరిశెట్టి రాము, బొక్క శ్రీనివాస్, హరిప్రసాద్, ప్రవీణ్, రజనీకాంత్ , గాలి ప్రభాకర్, టి, నరేష్, బత్తుల చిన్ని, రవ్వ సాంబయ్య, ఆదిత్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు



# ఫాదర్ కొలంబో 100వ జయంతి వేడుకలు ఘనంగా

**గ్రామీణ ఆరోగ్య కేంద్రం ప్రారంభం**

**మన దునియా,ధర్మసాగర్:మార్చి15**



ప్రముఖ సేవామూర్తి ఫాదర్ కొలంబో గారి 100వ జయంతి సందర్భంగా నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఫాదర్ కొలంబో గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ మెత్రాసనా పాలనాధికారి ఫాదర్ విజయ్ పాల్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఫాదర్ విజయ్ పాల్ రెడ్డి మాట్లాడుతూ ఫాదర్ కొలంబో గారు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ముఖ్యంగా పేద ప్రజలకు విద్యా, వైద్య సేవలు అందించడంలో విశేష కృషి చేశారని అన్నారు. ఆయన సేవా భావం సమాజానికి ఆదర్శమని, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ ఆరోగ్య కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు.మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య మాట్లాడుతూ ఫాదర్ కొలంబో గారు మానవతా దృక్పథంతో సమాజ సేవలో ముందుండి పనిచేశారని కొనియాడారు. ఆయన సేవలను స్మరించుకుంటూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ ఆరోగ్య కేంద్రం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఫాదర్ కొలంబో మెడికల్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ ఫాదర్ తరుణ్ రెడ్డి, మెడికేర్ హాస్పిటల్ డైరెక్టర్ ఫాదర్ చిన్నపరెడ్డి, విచారణ గురువులు ఫాదర్ సుధాకర్, వంగలపల్లి సర్పంచ్ భూక్యా మేనక, కరుణాపురం సర్పంచ్ గుర్రపు రీనా ప్రవీణ్, పెద్దపెండ్యాల సర్పంచ్ తోట నాగరాజు, ధర్మాపురం సర్పంచ్ బొమ్మినేని రమాదేవి,నష్కల్ సర్పంచ్ రాజు యాదవ్,ఉప సర్పంచులు, గ్రామ పెద్దలు మరియు విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళలు ప్రతి రంగంలో అవకాశాలను అందిపుచ్చుకుని తమ సత్తాను చాటాలి:నాయిని నీలిమ రెడ్డి

**మన దునియా,హనుమకొండ, మార్చి15**




మహిళలు అన్ని రంగాల్లో లభిస్తున్న అవకాశాలను వినియోగించుకుని తమ ప్రతిభను చాటాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారి సతీమణి శ్రీమతి నాయిని నీలిమ రెడ్డి గారు అన్నారు.మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని టీటీడీ కల్యాణ మండపంలో విస్డం చారిటబుల్ ట్రస్ట్ మరియు బగలా మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన డైనమిక్ లేడీ అవార్డ్స్ -- 2026 కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయిని నీలిమ రెడ్డి గారు మాట్లాడుతూ మహిళలు విద్య, ఉద్యోగం, వ్యాపారం వంటి ప్రతి రంగంలో ముందుకు రావాలని, సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని అన్నారు. మహిళలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతిరోజూ కొంత సమయం తమకోసం కేటాయించుకోవాలని సూచించారు. మహిళలు బలంగా ఉంటే కుటుంబం కూడా బలంగా ఉంటుందని పేర్కొన్నారు.తదుపరి వివిధ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న మహిళలకు అవార్డులు, బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన విస్డం చారిటబుల్ ట్రస్ట్ మరియు బగలా మీడియా ప్రతినిధులను నాయిని నీలిమ రెడ్డి గారు అభినందించారు.అంతకుముందు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాయిని నీలిమ రెడ్డి గారిని నిర్వాహకులు ఘనంగా స్వాగతించి శాలువాతో సత్కరించారు.

# పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యం

**రొయ్యూరు సర్పంచు కావిరి అర్జున్**

**మన దునియా,ఏటూరునాగారం,మార్చి15.**



గ్రామాలలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర అత్యంత కీలకమని రొయ్యూర్ సర్పంచ్ కావిరి అర్జున్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏటూరునాగారం మండలంలోనీ రొయ్యూర్ గ్రామపంచాయతీ ఆవరణలో ఆదివారం పారిశుధ్య కార్మికులను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా సర్పంచు కావిరి అర్జున్ మాట్లాడుతూ గ్రామాలు,పరిశుభ్రంగా ఉండేందుకు పారిశుధ్య కార్మికులు నిరంతరం కష్టపడుతున్నారని చెప్పారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే నిజమైన సేవకులు పారిశుధ్య కార్మికులేనని కొనియాడారు. సమాజ ఆరోగ్యం, పరిశుభ్రత కోసం వారు చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో పారిశుధ్య కార్మికుల సేవలు మరింత కీలకమని అన్నారు. సమాజం వారి సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సర్పంచ్ కావిరి అర్జున్ తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రాపాల్గొన్నాస్థానికులు గ్రామ సిబంది కారోబార్ గజ్జల శంకర్ ఆకుదారి రమేష్ దోంగిరి రాంబాబు మంతెన గట్టయ్య సిక్కల వరలక్ష్మి ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొండగొర్ల తిరుపతి గజ్జల అంకుల్ మాజీ వార్డు సభ్యులు కొండగొర్ల నరసింములు ఆశవర్కర్లు రాజాలక్ష్మి రమాదేవి గ్రామస్తులు సోదరి సుధాకర్ మూలకాల సాంబయ్య మోతే బాబు కొయ్యల శేఖర్ తదితరులు పాల్గొన్నారు

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# పరిగి బీజేపీ సారథి ఎవరు?

**గ్రూపులతో శ్రేణుల సతమతం**

**పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలంటున్న అభిమానులు**

**మన దునియా,వికారాబాద్,పరిగి: మార్చి15**




పరిగి(వికారాబాద్): పరిగి అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీకి నాయకత్వ లోపం ఏర్పడింది. దేశంలో ఆ పార్టీకి అనుకూల పవనాలున్నా పరిగిలో మాత్రం పార్టీని నడిపే నాయకుడు లేకుండా పోయాడు. పార్టీలో ఏళ్లనుంచి కొనసాగుతున్న కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దగా ప్రచారం చేయకపోయినా కమలం గుర్తు 16వేలకుపైగా ఓట్లు సాధించించింది. లోక్‌సభ ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ కంటే బీజేపీ ఎక్కువ ఓట్లు సాధించింది. ఇటీవలి పురపాలక ఎన్నికల్లోనూ ఉనికి చాటింది. రెండు వార్డుల్లో గట్టి పోటీనిచ్చింది. కొందరు అభ్యర్థులు స్వల్ప ఓట్లతో ఓడారు. పోలైన ఓట్లలో తొమ్మిది శాతం(1,659) సాధించింది. అయితే నాయకత్వలోపం సమస్యగా మారిందని కార్యకర్తలు అంటున్నారు. గతంలో ఎప్పుడూ బీజేపీకి అసెంబ్లీ ఎన్నికల్లో పది వేలలోపే ఓట్లు పడేవి. అయితే క్రమంగా పార్టీ బలపడుతున్న సూచనలు కన్పిస్తున్నాయి.

ఎవరికి వారే కన్వీనర్!

పార్టీ జిల్లా కన్వీనర్‌గా కొనసాగుతున్న కరణం ప్రహ్లాద్‌రావు పరిగికి చెందినాయనే. అయితే ఆయన పరిగిపై దృష్టి సారించడం లేదు. చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి సైతం తన పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో పరిగిని పట్టించుకోవడం లేదని శ్రేణులు అసంతృప్తితో ఉన్నాయి. నడిపించే నాయకుడు లేకుంటే పార్టీ ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు నాయకత్వ లోపం, మరోవైపు ద్వితీయ శ్రేణి నాయకుల్లో గ్రూపులతో పార్టీకి నష్టం జరుగుతుంది. చాలా ఏళ్లుగా పరిగిలో సీనియర్ నేత కరణం ప్రహ్లాద్‌రావు పార్టీకి పెద్దదిక్కుగా కొనసాగారు.ఇప్పుడాయన యాక్టీవ్‌గా పనిచేయడం లేదు. అలాగే వేముల పెంటయ్య, ఏవీ.రాములు, జి.శ్రీనివాస్, ఘణపూర్ వెంకటయ్యగౌడ్, రాముయాదవ్, బి.రాంచందర్‌లు పనిచేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బి.మారుతికిరణ్ పోటీ చేశారు. కేఎస్సార్ ట్రస్ట్ చైర్మన్ కె.శరత్‌కుమార్‌రెడ్డి క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. బృంగి హరికృష్ణ సైతం బీజేపీలో చేరారు. అసెంబ్లీ కన్వీనర్‌గా ఇద్దరు, ముగ్గురు నాయకులు తామే కన్వీనర్ అని చెప్పుకుంటూ గ్రూపు నాయకులుగా కొనసాగుతున్నారు. పార్టీ బలపడుతున్న తరుణంగా గ్రూపులతో నష్టం వాటిల్లుతుందని కార్యకర్తలు, పార్టీ అభిమానులు వాపోతున్నారు..

## వంట గ్యాస్ ధర ఆఫ్టాల్ 60 రూపాయలు పెరిగింది..905 నుండి 965 అని ఈ కాంగీ కమ్మీలు గోల చేస్తున్నారు.

**మన దునియా,హైదరాబాద్: మార్చి 15**



కక్కుర్తి కొడుకులు ఆఫ్టాల్ 60 రూపాయలు కోసం తెగ గోల చేస్తున్నారు. ఒక్క సిలిండర్ సామాన్యుడికి నాలుగు నెలలు వస్తుంది. అంటే రోజుకి ఒక 50 పైసలు పెంచారు. ఆ మాత్రం దానికి ఇంత హడావుడి. పోనీ వాళ్ళ లెక్క ప్రకారం ముష్టి 50 పైసలు కూడా డబ్బులు అనుకుందాం. కానీ మోదీ గారు ఎందుకు పెంచారో చతెలుసా? అంతర్జాతీయ కుట్రలు ఆయనకు తెలుసు. అందుకే ఎవ్వరూ ఊహించని పథకాన్ని రచించారు. ఇప్పటి వరకు మనిషి పుట్టిన దగ్గర నుంచి నేటి వరకు ఇటువంటి వ్యూహం ఎవ్వరూ వెయ్యలేదు. సామాన్యంగా అంతర్జాతీయ స్థాయిలో చమురు ధరలు పెరిగినప్పుడు గ్యాస్ అండ్ పెట్రోల్ ధరలు పెరుగుతాయి. ఇది ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతుంది. ఇప్పుడు ఇండియాలో రేట్లు పెంచకపోతే, భారత దేశం వద్ద నిల్వల గురించి చైనా పాకిస్తాన్ అమెరికా రష్యా వంటి దేశాలకు తెలిసిపోతుంది. సో ఖచ్చితంగా రేట్లు పెంచాలి. కానీ ప్రజలకు ఇబ్బంది ఉండకూడదు.ఇక్కడే మోదీ అపర చాణక్యంతో పాటు ఆయనకు ప్రజల పట్ల ఉన్న ప్రేమ కనిపిస్తుంది. ఖాళీ సిలిండర్ బరువు 15 నుంచి 16 కేజీలు ఉంటుంది. అందులో ఫీల్ చేసే గ్యాస్ 14.2 కిలోలు. రహస్య ఉత్తర్వుల ద్వారా అన్ని ఫిల్లింగ్ స్టేషన్లో 16.2 కిలోలు లోడ్ చెయ్యాలి అని తెలియచేశారు. ఇదంతా బయటకు కనబడదు. అందరికీ రేట్లు పెంచినట్టే కనబడుతుంది. కానీ 60 రూపాయలకు సరిపడా ఎక్కువ గ్యాస్ ప్రజలకు చేరింది.మీకు నమ్మకం కుదరకపోతే.. మీ ఇంట్లో గ్యాస్ సిలెండర్ ఎత్తి చూడండి. ఇంతక ముందు కన్నా బరువుగా ఉంటుంది. ఇంకా నమ్మకం కుదరకపోతే ఈ కాంగి కమ్మీలు సిలిండర్ల తో బయటకి ఎందుకు రావడం లేదో ఆలోచించండి. వాళ్ళు కొత్త గ్యాస్ సిలిండర్లు ఎత్తలేకపోతున్నారు.దేశం కోసం ధర్మం కోసం హిందుత్వం కోసం తగ్గేదెలే ఈ కంటికి కనబడని మోడీజీ గారి వ్యూహ పచ్చినిజాన్ని చెయ్యండ

## గ్యాస్ సిలిండర్ బుకింగ్ మోసాలపై ఎస్పీ హెచ్చరిక

**మన దునియా,సూర్యాపేట జిల్లా: మార్చి 15**



గ్యాస్ సిలిండర్ బుకింగ్ మోసాలపై ఎస్పీ హెచ్చరిక గ్యాస్ సిలిండర్ బుకింగ్ పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ సూచించారు. కేవైసీ అప్‌డేట్, సబ్సిడీ పేరుతో వచ్చే నకిలీ లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీలను ఎవరితోనూ పంచుకోవద్దని ఆయన హెచ్చరించారు. బుకింగ్ కోసం అధికారిక యాప్‌లను మాత్రమే ఉపయోగించాలని, మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

# చంద్రబాబుపై రాళ్ల దాడి కేసు: నలుగురి బెయిల్ రద్దు, వైసీపీ ఎమ్మెల్సీకి ముందస్తు బెయిల్

**మన దునియా,ఆంధ్రప్రదేశ్:మార్చి 15**




ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఆయన కాన్వాయ్‌పై జరిగిన రాళ్ల దాడి కేసులో హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులోని మొదటి నలుగురు నిందితులకు గతంలో నందిగామ కోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను ఉన్నత న్యాయస్థానం రద్దు చేసింది. తీర్పు కాపీ అందిన వారం రోజుల్లోగా సంబంధిత మేజిస్ట్రేట్ ముందు లొంగిపోవాలని నిందితులను ఆదేశించింది. ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్, ఆయన సోదరుడు జగన్మోహనరావుతో పాటు మరికొందరికి షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. 2022 నవంబర్ 5న కృష్ణా జిల్లా నందిగామలో 'బాదుడే బాదుడు' కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు పర్యటిస్తుండగా, ఆయన కాన్వాయ్‌పై రాళ్ల దాడి జరిగింది. ఈ ఘటనలో చంద్రబాబు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మధుసూధనరావు గాయపడ్డారు. ఆయన ఫిర్యాదు మేరకు నందిగామ పోలీసులు కేసు నమోదు చేశారు.ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఈ ఘటనపై ప్రత్యేక బృందాలతో లోతుగా దర్యాప్తు చేపట్టారు. చంద్రబాబును హత్య చేసేందుకే ప్రణాళికతో దాడి చేశారని తేల్చిన పోలీసులు, కేసులో హత్యాయత్నం (సెక్షన్ 307), నేరపూరిత కుట్ర (సెక్షన్ 120బీ) వంటి సెక్షన్లను చేర్చారు.

**కింది కోర్టు తీర్పును తోసిపుచ్చిన హైకోర్టు**

ఈ కేసులో 2024 నవంబర్ 23న అరెస్ట్ అయిన నిందితులు కన్నెగంటి సజ్జనరావు, బెజవాడ కార్తీక్, పరిమి కిశోర్, ఎం. శ్రీనివాసరావులను పోలీసులు నందిగామ కోర్టులో హాజరుపరిచారు. అయితే, హత్యాయత్నం వంటి తీవ్రమైన సెక్షన్లు వర్తించవని పేర్కొంటూ న్యాయమూర్తి వారికి బెయిల్ మంజూరు చేశారు. ఈ తీర్పును సవాలు చేస్తూ నందిగామ సీఐ హైకోర్టును ఆశ్రయించారు. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు.విచారణ జరిపిన జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, నందిగామ కోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులను రద్దు చేస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చారు. కాగా, ముందస్తు బెయిల్ పొందిన వారు పాస్‌పోర్టులను దర్యాప్తు అధికారికి అప్పగించాలని, చార్జిషీటు దాఖలు చేసే వరకు ప్రతి ఆదివారం ఐవో ముందు హాజరుకావాలని స్పష్టమైన షరతులు విధించారు.

# విజయ్‌తో పవన్ కళ్యాణ్ మంతనాలు?

**మన దునియా,తమిళనాడు: మార్చి 15**



ఆంధ్రప్రదేశ్‌లో కూటమిని విజయపథంలో నడిపించిన పవన్ కళ్యాణ్, ఇప్పుడు అదే ఫార్ములాను తమిళనాడులో అమలు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దళపతి విజయ్‌ని ఎన్డీఏ కూటమిలోకి ఆహ్వానించడం ద్వారా డీఎంకేకు గట్టి పోటీ ఇవ్వాలని బీజేపీ భావిస్తోంది. ఈ బాధ్యతను పవన్ కళ్యాణ్‌కు అప్పగించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ అంశంపై జరుగుతున్న ప్రచారంతో పవన్ కల్యాణ్ తమిళ మీడియాకు ఇంటర్యూ ఇస్తున్నారు.తంతి టీవీకి ఇచ్చిన తాజా ఇంటర్యూలో పవన్ కల్యాణ్ విజయ్ నటించిన జననాయగన్ చిత్ర సెన్సార్ వివాదం, కరూర్ ఘటనపై సీబీఐ విచారణ వంటి పరిణామాలపై స్పందించారు. ఈ ఇంటర్వ్యూలో పవన్ కళ్యాణ్ కేవలం విజయ్ గురించే కాకుండా, తమిళనాడులో రాబోయే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాల అవశ్యకతను వివరించినట్లుగా తెలుస్తోంది. ఏపీలో తాము సాధించిన విజయం, కూటమి పార్టీల మధ్య సమన్వయం ఎలా ఉందనే విషయాలను పంచుకున్నారు.ఆదివారం పవన్ ఇంటర్యూనూ తంతి టీవీ ప్రసారం చేయనుంది. విజయ్ పార్టీ టీవీకే నాయకులు ప్రస్తుతం ఒంటరిగా వెళ్లాలని భావిస్తున్నప్పటికీ, పవన్ చర్చల తర్వాత వారి ఆలోచనా ధోరణిలో మార్పు వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాత్రి 9 గంటలకు ప్రసారం కానున్న ఈ ఇంటర్యూపై అటు విజయ్ అభిమానులు, ఇటు రాజకీయ నేతలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. విజయ్‌ను ఎన్డీఏలోకి తీసుకురావడంలో పవన్ కళ్యాణ్ ఎంతవరకు సఫలమయ్యారు? సీబీఐ విచారణపై ఆయన స్పందన ఏమిటి? అనే ప్రశ్నలకు ఈ ఇంటర్యూ ద్వారా స్పష్టత రానుంది.

# సీఈసీపై అభిశంసన -- జగన్‌కు దమ్ముందా?

**మన దునియా,ఆంధ్రప్రదేశ్: మార్చి 15**

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్‌పై ప్రతిపక్షాలు అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాయి. ఇప్పుడు అందరి దృష్టి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వైపు మళ్లింది. 2024 ఎన్నికల్లో ఈవీఎంల అవకతవకలు జరిగాయని, కూటమి విజయం వెనుక ఈసీ హస్తం ఉందని పదేపదే ఆరోపిస్తున్న వైసీపీకి, ఇప్పుడు తన చిత్తశుద్ధిని నిరూపించుకునే అవకాశం దక్కింది.

**వైసీపీ ఆరోపణలు -- అసలు సవాల్**

2024 అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీ ఈసీ పనితీరుపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసింది. ఓట్ల లెక్కింపులో తేడాలు ఉన్నాయని, 51 లక్షల ఓట్లపై స్పష్టత లేదని రాజ్యసభలో ఆ పార్టీ ఎంపీలు నిలదీశారు. ఇప్పుడు అదే ఈసీపై పక్షపాత వైఖరి, ఎన్నికల మోసం అనే ఆరోపణలతో ఇండియా కూటమి అభిశంసన తీర్మానం నోటీసు ఇచ్చింది. మరి ఈ తరుణంలో వైసీపీ ఆ తీర్మానానికి మద్దతు ఇస్తుందా లేక తటస్థంగా ఉంటుందా అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

**నైతికతకు పరీక్ష**

బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు జరగాలని వైసీపీ పదేపదే డిమాండ్ చేస్తోంది. ఈసీ తీరుపై నమ్మకం లేదని చెబుతున్న పార్టీ, ఇప్పుడు సీఈసీని తొలగించే ప్రక్రియలో భాగస్వామి కాకపోతే ఆ పార్టీ చెప్పే విలువలపై సందేహాలు తలెత్తుతాయి. ఒకవేళ వైసీపీ ఈ తీర్మానాన్ని వ్యతిరేకిస్తే లేదా గైర్హాజరైతే, ఎన్నికల అక్రమాలపై ఆ పార్టీకి మాట్లాడే నైతిక హక్కు ఉండదు. అప్పుడు కూటమి విజయంపై వారు చేసే విమర్శలు కేవలం ఓటమి సాకులు గానే మిగిలిపోతాయి. పార్లమెంట్‌లో వైసీపీకి ఉన్న బలంతో ఈ తీర్మానం విషయంలో ఆ పార్టీ కీలకం కాదు. కానీ తమ ఓటమికి ఈసీనే కారణమని నమ్ముతున్న వైసీపీకి, ఇప్పుడు సీఈసీని దోషిగా నిలబెట్టేందుకు ఇదొక అద్భుతమైన అవకాశం. ఈ అవకాశాన్ని వాడుకోకుండా మౌనంగా ఉంటే, ప్రజల్లో ఆ పార్టీ విశ్వసనీయత దెబ్బతినే ప్రమాదం ఉంది. పదేపదే ఈవీఎంలను తిడుతూ, సీఈసీకి అండగా నిలబడితే అది ద్వంద్వ నీతి కిందకే వస్తుంది.

**నైతిక విలువల్లాంటివి వైసీపీకి ఉండవా?**

ఇప్పటికే 193 మంది ఎంపీలు ఈ నోటీసుపై సంతకాలు చేశారు. వైసీపీ ఎంపీలు కూడా దీనికి మద్దతు ఇస్తే ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెరుగుతుంది. కానీ, కేంద్రంలోని బీజేపీతో సత్సంబంధాల కోసమో లేక ఇతర రాజకీయ సమీకరణాల వల్లో వైసీపీ వెనుకడుగు వేస్తే.. అది ఆ పార్టీ నైతిక పతనానికి సంకేతం. మరి వైసీపీ అధినేత జగన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో, ఆయన నైతికత ఏంటో ఈ అభిశంసన తీర్మానం తేల్చి చెప్పనుంది. ఇలాంటి నైతికతలకు తాము అతీతం అని ఊరుకుంటారా?



# నారా లోకేష్ ప్రత్యేకత.... పాజిటివ్ పాలిటిక్స్!

**మన దునియా,ఆంధ్రప్రదేశ్:మార్చి 15**

రాజకీయాల్లో విలక్ష నేతగా నారా లోకేష్ కనిపిస్తున్నారు. ఎవరైనా అధికారంలో ఉన్నప్పుడు సమస్యలను ఎత్తి చూపేవారిని శత్రువులుగా చూస్తారు. వైసీపీ హాయంలో సమస్యలు చెప్పిన వాళ్లపై టీడీపీ ముద్ర వేసి వేధించారు. కానీఇక్కడ లోకేష్ భిన్నమైన మార్పు చూపిస్తున్నారు. సమస్యలను ప్రస్తావించడాన్ని ఓ సానుకూల విషయంగా చూసి వాటిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ కోణంలో మన్యంలో సమస్యలపై జాతీయ మీడియా కథనాలు వచ్చినా.. గుంటూరులో డ్రైనేజీ సమస్య గురించి ఓ మహిళ చెప్పినా... ఉద్దేశపూర్వకంగా చేశారని తెలిసినా.. మధ్యాహ్నాభోజనం అంశంపై ఓ వీడియోలో విద్యార్థుల ఆగ్రహం గురించి తెలిసినా..ఆయన చాలా పాజిటివ్ గా స్పందించారు. సమస్యల పరిష్కారం కోసం అప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు.



**పాలకపక్ష దృక్పథాన్ని మార్చేస్తున్న లోకేష్**

సాధారణంగా అధికారంలో ఉన్నవారు తమ వైఫల్యాలను ఎత్తిచూపే వారిని రాజకీయ శత్రువులుగా చూస్తుంటారు. కానీ, ఇప్పుడు నారా లోకేష్ ఆ ధోరణిని పూర్తిగా మార్చేస్తున్నారు. తన వద్దకు వచ్చే విమర్శలను, సోషల్ మీడియాలో వచ్చే ఫిర్యాదులను ఆయన ఒక ఫీడ్‌బ్యాక్ గా స్వీకరిస్తున్నారు. సమస్య ఎక్కడ ఉన్నా, అది ఎవరు చెప్పినా.. దాని వెనుక రాజకీయం ఉందా లేదా అని చూడకుండా పరిష్కారం వైపే అడుగులు వేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా దేవునిచెరువు పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత సరిగ్గా లేదని విద్యార్థులు ఆహారాన్ని చెత్తబుట్టలో పోస్తున్న వీడియో వైరల్ అయ్యింది. దీనిపై లోకేష్ స్పందించిన తీరు అందరినీ ఆశ్చర్యపరిచింది. సాధారణంగా ఇలాంటి ఘటనలు జరిగితే సమర్థించుకోవడానికి ప్రయత్నిస్తారు, కానీ లోకేష్ మాత్రం నిస్సంకోచంగా క్షమాపణలు చెప్పారు. నా బిడ్డలకు నాణ్యమైన ఆహారం అందకపోవడం నా బాధ్యతారాహిత్యం అని పేర్కొంటూ వెంటనే సంబంధిత ఏజెన్సీని తొలగించి, హెడ్ మాస్టర్‌ను సస్పెండ్ చేయించారు. ఒక మంత్రి స్థాయి వ్యక్తి బహిరంగంగా క్షమాపణలు చెప్పడం రాజకీయాల్లో అత్యంత అరుదైన విషయం.

**మన్యం నుంచి గుంటూరు దాకా**

జాతీయ మీడియాలో మన్యం ప్రాంత సమస్యల గురించి కథనాలు వచ్చినా, గుంటూరులో ఒక మహిళ తన దుకాణం ముందు డ్రైనేజీ సమస్య గురించి నిలదీసినా లోకేష్ ఏనాడూ సహనం కోల్పోలేదు. అది ఉద్దేశపూర్వకంగా చేసిన రాజకీయం అని అనిపించినా.. ఆయన మాత్రం చెప్పిన సమస్యలోని వాస్తవాన్ని గమనించి అప్పటికప్పుడే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తున్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో రోడ్ల సౌకర్యం గురించి వచ్చిన కథనాలపై కూడా ఆయన సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవడం ఆయన కార్యదక్షతకు నిదర్శనం.

**నాగబాబు ప్రశంసలు**

లోకేష్ అనుసరిస్తున్న ఈ సరికొత్త పంథాను జనసేన నాయకుడు, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు కూడా మనస్ఫూర్తిగా ప్రశంసించారు. విమర్శలను స్వీకరించి, వాటిని పరిష్కరించే విషయంలో లోకేష్ చూపిస్తున్న పరిణతి రాజకీయాల్లో గొప్ప మార్పుకు సంకేతమని ఆయన పేర్కొన్నారు. నారా లోకేష్ ప్రదర్శిస్తున్న పాజిటివ్ యాటిట్యూడ్ ఏపీ రాజకీయాల్లో ఒక సరికొత్త సంస్కృతికి నాంది పలుకుతోంది. విమర్శించే వారు కూడా లోకేష్ స్పందన చూసి ఆయన అభిమానులుగా మారుతున్న పరిస్థితి కనిపిస్తోంది. సమస్యలను దాచిపెట్టడం కంటే, వాటిని అంగీకరించి సరిదిద్దడమే నిజమైన నాయకత్వ లక్షణమని లోకేష్ తన పనితీరుతో నిరూపిస్తున్నారు.

# రెయిన్ అలర్ట్.. తెలంగాణలోని ఈ జిల్లాల్లో ఐదు రోజులు వానలేవానలు.. వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు

**తెలంగాణకు రెయిన్ అలర్ట్**

**నేటి నుంచి 20వ తేదీ వరకు వానలు**

**ఐదు రోజులపాటు తగ్గనున్న ఉష్ణోగ్రతలు**

**మన దునియా,హైదరాబాద్: మార్చి15**

తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ఉదయం 9గంటల దాటితే బయటకు రావాలంటే ఎండ తీవ్రతతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి పరిస్థితి. ఇక మధ్యాహ్నం సమయంలో ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం సమయంలో ఉక్కపోతతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో వాతావరణ శాఖ చల్లటి కబురు తీసుకొచ్చింది. తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. తెలంగాణ రాష్ట్రంలో ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు ద్రోణి ప్రభావంతో రెండు విడతల్లో కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈనెల 15 నుంచి 17వ తేదీ మధ్య ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మెదక్, సిద్ధిపేట, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈనెల 16వ తేదీ నుంచి 20వ తేదీ మధ్య రాష్ట్రంలోని మరికొన్ని జిల్లాల్లో భారీ నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, పిడుగులు, ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వానలుకూడా పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. పలు జిల్లాల్లో 40డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ క్రమంలో వర్షాలు పడనుండటంతో ఎండల తీవ్రత తగ్గనుంది. వారంరోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో.. ఉరుములు, మెరుపుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. ముఖ్యంగా వర్షాలు పడే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉందని, ఈదురు గాలులు వీచే అవకాశం ఉంటుందని.. ఆ సమయాల్లో ప్రజలు చెట్ల కింద, హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు ఉండే ప్రాంతాల్లో ఉండొద్దని, సురక్షిత ప్రాంతాల్లోకి వెళ్లాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. మరోవైపు.. ప్రస్తుతం రైతులు సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయం.. ఇలాంటి సమయంలో ఈదురుగాలులు, వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. కొన్ని ప్రాంతాల్లో పంటలు పొలాల్లో కోత దశలో ఉండగా.. కొన్ని ప్రాంతాల్లో కల్లాల్లో ఉన్నాయి. ఇలాంటి సమయంలో వర్షాలు పడితే రైతులకు ఇబ్బందికరంగా మారుతుంది. దీంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ముందస్తుగా పంటలను కాపాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు.



# జగన్‌కు లేని హోదా.. ఇక్కడ కేసీఆర్‌కు ఇచ్చాం: మంత్రి కోమటిరెడ్డి

**మన దునియా,సంగారెడ్డి,మార్చి15**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు రేపటి(సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలోనే మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరై, ప్రభుత్వానికి నిర్మాణాత్మకమైన సలహాలు, సూచనలు అందించాలని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం సంగారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత అసెంబ్లీ సమావేశాల్లో కేసీఆర్ కేవలం ఇలా వచ్చి అలా వెళ్లిపోయారని, ఈసారైనా పూర్తిస్థాయిలో సభలో ఉండాలని ఆయన కోరారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. 'తెలంగాణ ప్రజల తరపున నేను కేసీఆర్‌కు ఒకటే విజ్ఞప్తి చేస్తున్నా. మీరు సభకు వచ్చి మా ప్రభుత్వానికి సలహాలు ఇవ్వండి. మీరు ఇచ్చే మంచి సూచనలు స్వీకరించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో వైపీసీ 11 సీట్లు వచ్చినా అక్కడ ప్రతిపక్ష హోదా దక్కలేదు, కానీ తెలంగాణలో మేము గౌరవప్రదంగా ప్రతిపక్ష హోదా ఇచ్చాం. ప్రభుత్వం చేసే మంచి పనులను కేసీఆర్ అభినందిస్తే, ఆయనకే గౌరవం. తెలంగాణ ఉద్యమ సమయంలో తాము అధికార పార్టీలో ఉండి కూడా రాష్ట్రం కోసం సస్పెండ్ అయ్యాను. మూసీ పునరుజ్జీవంపై కేటీఆర్ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చూస్తుంటే నవ్వు వస్తోంది. మూసీ కాలుష్యం వల్ల నల్గొండ ప్రజలు పడుతున్న ఇబ్బందులు మాకు తెలుసు. ఫ్లోరైడ్ సమస్యలతో దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నాం' అని అన్నారు..




## ఏప్రిల్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు!

**మన దునియా,హైదరాబాద్:మార్చి 15**



ఏప్రిల్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు! తెలంగాణ : రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఏప్రిల్‌లో రెండో విడత జాబితా కింద ఇళ్లను మంజూరు చేయనున్నట్లు ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. కాగా ఈ పథకం కింద స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునేవారికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. నాలుగు విడతలుగా లబ్ధిదారుల అకౌంట్లలో వీటిని జమ చేస్తోంది. కాగా తొలి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేశారు.

## తెలంగాణలో ధాన్యం రవాణాకు రేక్స్ కొరత లేదు: కేంద్రం

**మన దునియా,హైదరాబాద్:మార్చి 15**



తెలంగాణలో ధాన్యం రవాణాకు రేక్స్ కొరత లేదు: కేంద్రం తెలంగాణలో ధాన్యం, పత్తి రవాణాకు అవసరమైన రైల్వే రేక్స్‌ను సమృద్ధిగా కేటాయిస్తామని కేంద్ర రైల్వే శాఖ ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం, భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) అందించే రిపోర్టుల ఆధారంగానే రైల్వే బోగీల కేటాయింపు జరుగుతుందని కేంద్రం వివరించింది. ఎంపీ కడియం కావ్య లేవనెత్తిన సమస్యకు సమాధానమిస్తూ, 2026 జనవరి నాటికి సుమారు 3.59 మిలియన్ టన్నుల ధాన్యం లోడింగ్ పూర్తయిందని, దీని కోసం1,329 రైల్వే రేక్స్‌ను వినియోగించినట్టు కేంద్ర రైల్వే శాఖ సహాయమంత్రి రవనీత్ సింగ్ తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.

## మర్రిగూడెంలో మొక్కజొన్న చేనులను ముంచెత్తిన మంటలు

**ట్రాక్టర్లతో అగ్నికీలలను అడ్డుకుంటున్న రైతులు..**

**మన దునియా మహబూబాబాద్ జిల్లా:గంగారం:మార్చి15**



మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం మర్రిగూడెంలో చూస్తుండగానే అగ్నికీలలు ఆకాశాన్ని తాకుతూ సమీపంలోని మొక్కజొన్న తోటలను చుట్టుముట్టాయి. ఎండవేడికి ఎండుటాకులు తోడవడంతో మంటలు క్షణాల్లో విస్తరించాయి. మంటలను అదుపు చేయడానికి అగ్నిమాపక వాహనం అందుబాటులో లేకపోవడంతో, స్థానిక రైతులు తమ ట్రాక్టర్లనే అగ్నిమాపక యంత్రాలుగా మార్చారు. మంటలు పక్క పొలాలకు వ్యాపించకుండా ట్రాక్టర్ల సహాయంతో పొలాన్ని దున్నుతూ 'ఫైర్ బ్రేక్' ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఉమ్మడి కొత్తగూడ మండలంలో శాశ్వత ప్రాతిపదికన అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

## ఆర్చరీలో సత్తా చాటిన ఆదివాసి ఆణిముత్యం

**జాతీయ స్థాయికి ఎంపిక**

**తాటిగూడెం గ్రామానికి చెందిన కొమరం అశ్విత్ దొర**

**మన దునియా,తాటిగూడెం: మార్చి 15**



భద్రాద్రి కొత్తగూడెం ఛత్తీస్గఢ్ రాష్ట్రంలో ఈనెల 26 నుండి 29 వరకు జరగనున్న జాతీయస్థాయి ఖేలో ఇండియా ట్రైబల్ ఆర్చరీ పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుండి నలుగురు ట్రైబల్ క్రీడాకారులు ఎంపికయ్యారు.ఎంపికలో కరకగూడెం మండలంలోని తాటిగూడెం గ్రామానికి చెందిన కొమరం వెంకటనారాయణ భద్రాచలం ఐటిడిఏ అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ కుమారుడు కొమరం అశ్విత్ దొర ఎంపిక కావడం గర్వకారణం.ఇటీవల పలు రాష్ట్రాల్లో జరిగిన ఆర్చరీ పోటీల్లో అశ్విత్ దొర తెలంగాణ రాష్ట్ర ప్రాతినిధ్యం వహిస్తూ,అత్యంత ప్రతిభ కనబరిచారు.జాతీయ స్థాయికి పోటీలకు అశ్విత్ దొర ఎంపికైనందుకు తల్లిదండ్రులు,గ్రామస్తులు, ఆర్చరీ అసోసియేషన్ వారు ప్రత్యేకంగా అభినందించారు.అదేవిధంగా ఈ నెలలో జరిగే జాతీయస్థాయి ఆర్చరీ పోటీలలో రాణించి మన ప్రాంతానికి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో డాక్టర్‌పై అసభ్య ప్రవర్తన ఆరోపణలు...??!!

**మన దునియా,మహబూబాబాద్ జిల్లా తొర్రూరు:మార్చి 15**



విజయ లక్ష్మి హాస్పిటల్ డాక్టర్ కిరణ్ కుమార్ అసభ్యంగా ప్రవర్తించాడని మహిళ ఆరోపణ.. జ్వరం చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లిన 21 ఏళ్ల యువతి ఇంజక్షన్ ఇచ్చిన తర్వాత యువతితో అనుచితంగా ప్రవర్తించాడని ఆరోపణ.. "నువ్వు అందంగా ఉన్నావు" అంటూ ముట్టుకున్నాడని కుటుంబ సభ్యుల ఆరోపణ..!! వెంటనే తల్లికి వాట్సాప్ ద్వారా సమాచారం ఇచ్చిన యువతి ఆసుపత్రికి చేరుకున్న తల్లిదండ్రులు యువతిని అక్కడి నుంచి తీసుకెళ్లడం మరో ఆసుపత్రిలో యువతికి చికిత్స అందించిన కుటుంబ సభ్యులు.. ఈ..విషయమై ఉదయం డాక్టర్‌ను ప్రశ్నించిన కుటుంబ సభ్యులు వాగ్వాదం జరిగి ఆగ్రహంతో డాక్టర్‌పై దాడి చేసిన బాధితురాలి కుటుంబ సభ్యులు.. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు డాక్టర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు తొర్రూరులో జరిగిన ఈ..ఘటనతో స్థానికంగా కలకలం..

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## ఇది షాకింగ్ మర్డర్ కేసు! నాన్నను అమ్మ చంపేసిందని కూతురు బయటపెట్టిన రహస్యం.

**భర్తను హత్య చేసి సహజ మరణంగా చిత్రీకరించిన భార్య -- ప్రియుడి సహాయంతో దిండు పెట్టి చంపి మద్యం ఫలితంగా చూపించిన ఖతిజా .**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లలో దారుణ హత్య కేసు**

**మన దునియా,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ తిప్పనపల్లి: మార్చి 15**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామంలో సెంట్రింగ్ కూలీగా పని చేస్తున్న ఎస్‌డీ. జాఫర్‌ను అతని స్వస్థలం చింతలపూడిలోనే భార్య ఖతిజా హత్య చేసింది. 13 ఏళ్ల క్రితం ఏలూరు జిల్లా చింతలపూడి గ్రామానికి చెందిన ఖతిజాను వివాహం చేసుకున్న జాఫర్, పదేళ్లు తిప్పనపల్లిలో నివసించి గత మూడేళ్లుగా చింతలపూడిలో ఉన్నాడు.వీరి కుమారుడు హాస్టల్‌లో చదువుతున్నాడు. ఎనిమిదేళ్ల కూతురు తల్లిదండ్రులతోనే ఉండేది. చింతలపూడి వాసి మీరాతో ఖతిజాకు వివాహేతర సంబంధం ఏర్పడటంతో దంపతుల మధ్య గొడవలు తీవ్రమయ్యాయి. ఆరు నెలల క్రితం తిప్పనపల్లికి తిరిగి వచ్చినప్పటికీ, ఖతిజా మీరాతో రహస్యంగా మాట్లాడుతూ ఉండటం జాఫర్‌కు తెలిసి, గత పది రోజులుగా ఆమెతో తీవ్ర గొడవలు జరిగాయి.

**అక్రమ సంబంధానికి అడ్డుకట్టిన భర్తను హత్య**

తన అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను ఎలాగైనా తొలగించాలని నిర్ణయించుకున్న ఖతిజా, ప్రియుడి సహాయంతో జాఫర్ నిద్రపోతున్నప్పుడు మొహంపై దిండు పెట్టి హత్య చేసింది. "మద్యం సేవించి కింద పడి గాయపడ్డాడు, తెల్లవారుజామున చనిపోయాడు" అని అందరినీ నమ్మించి అంత్యక్రియలు పూర్తి చేయించింది.అంత్యక్రియల తర్వాత కూతురితో మాట్లాడుతుండగా, "నాన్నను అమ్మ, ఇంకో వ్యక్తి కలిసి చంపేశారు" అంటూ షాకింగ్ విషయాన్ని బయటపెట్టింది. ఈ సమాచారంతో కుటుంబ సభ్యులు ఖతిజాను చితకబాది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**పోలీసుల దర్యాప్తు.. నిందితురాలి అరెస్టు**

కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన చింతలపూడి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆధారాలు సేకరించి ఖతిజాను అరెస్టు చేశారు.

## ఏపీ మంత్రి లోకేశ్ ఇంట సంబరాలు... దేవాన్ష్ పంచెకట్టు వేడుక...

**మన దునియా,ఆంధ్రప్రదేశ్: మార్చి 15**



వేడుకకు సంబంధించిన ఫోటోలను కూడా లోకేశ్ పంచుకున్నారు. "ఈ రోజు మా కుటుంబ సభ్యులు, సన్నిహిత బంధువులు అందరం కలిసి దేవాన్ష్ ధోతీ వేడుకను జరుపుకున్నాం. దేవాన్ష్ పెరిగి పెద్దవాడవుతూ మన సంప్రదాయాలను ఇంత మధురమైన రీతిలో స్వీకరించడం చూడటం మా అందరికీ గర్వకారణం. ఈ ప్రత్యేకమైన ఘట్టం నేపథ్యంలో, దేవాన్ష్‌కు జీవితాంతం సంతోషం, విజయం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు.ఈ వేడుకలో దేవాన్ష్ పంచెకట్టులో సంప్రదాయబద్ధంగా కనిపించాడు. లోకేశ్ పంచుకున్న ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పలువురు ప్రముఖులు, అభిమానులు దేవాన్ష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.ఇక, ఈ విశిష్ట వేడుకకు సీఎం చంద్రబాబు, నారా భువనేశ్వరి దంపతులు హాజరై మనవడికి దీవెనలు అందించారు. అటు, దేవాన్ష్ తాతయ్య నందమూరి బాలకృష్ణ, అమ్మమ్మ వసుంధర కూడా హాజరై మనవడి పంచెకట్టు వేడుకను సంతోషంగా తిలకించారు. ఇక బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాడు. తెలుగు సంప్రదాయం ప్రకారం మోక్షజ్ఞ మేనమామ హోదాలో దేవాన్ష్ కు కొత్త దుస్

## బాధ్యతగల ప్రజాప్రతినిధుల స్థానంలో ఉండి డ్రగ్స్ వాడిన వారిని కఠినంగా శిక్షించాలి

**మన దునియా,హైదరాబాద్: మార్చి 15**




డ్రగ్స్ మరియు ఏదైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడడాన్ని బీఆర్ఎస్ పార్టీ ఖండిస్తుంది.. డ్రగ్స్ వాడుతూ అమ్ముతున్న వారిని రాజకీయ అనుబంధంతో సంబంధం లేకుండా చట్టం ప్రకారం కఠినంగా శిక్షించాలి..డ్రగ్స్ కేసును బీఆర్ఎస్ పార్టీకి ఆపాదించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను..అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు డ్రగ్స్ పరీక్షకు హాజరు కావాలని మహేష్ కుమార్ గౌడ్ సూచనను నేను స్వాగతిస్తున్నాను..నేను ఏ పరీక్షకైనా సిద్ధంగా ఉన్నానని ఇప్పటికే చాలాసార్లు చెప్పాను.. ఏ సమయమైనా నేను ఎలాంటి పరీక్షకైనా సిద్ధం..ఏ సంబంధం లేకున్నా, నా పేరును ఈ డ్రగ్స్ కేసులలో లాగితే వారికి లీగల్ నోటీసులు ఇస్తాను..

## ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌పై డ్రగ్స్ కేసు.. సీఎం చంద్రబాబు ఆగ్రహం..

**మన దునియా,ఆంధ్రప్రదేశ్:మార్చి 15**




మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ వ్యవహారంపై ఏపీ సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేశ్‌పై ఆరోపణలను చంద్రబాబు సీరియస్‌గా తీసుకున్నారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఎంపీ మహేష్‌ను పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. ఆరోపణలకు సంబంధించి వివరణ కోరుతూ పుట్టా మహేశ్‌కు నోటీసులు ఇవ్వాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను చంద్రబాబు ఆదేశించారు ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ డ్రగ్స్ కేసులో పట్టుబడిన అంశంపై నివేదిక ఇవ్వాలని పల్లా శ్రీనివాస్‌ను సీఎం చంద్రబాబు ఆదేశించారు. డ్రగ్స్ వంటి ఘటనల్లో ఎవరు ఉన్నా ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వ్యక్తులు, నేతలు చేసే తప్పులకు పార్టీ నష్టపోయే పరిస్థితి రానివ్వనని సీఎం చంద్రబాబు తేల్చి చెప్పారు. కాగా, డ్రగ్స్ కేసులో అరెస్టైన పుట్టా మహేశ్‌కు స్టేషన్ బెయిల్ లభించడంతో విడుదలయ్యారు..

## వ్యవసాయ యాంత్రికరణ పరికరాలు పంపిణీ

**మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు అంబటి విజ్ఞప్తి**

**మన దునియా,రఘునాథపాలెం: మార్చి 15**





రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహించే లక్ష్యంతో వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ పథకం ద్వారా రైతులకు వ్యవసాయ యంత్రాలను పంపిణీ చేసే కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నేడు రఘునాథపాలెం రైతు వేదికలో నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని అంబటి వెంకటేశ్వరరావు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకవెళ్లారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.మరియు త్వరలొనె మత్కేపల్లి మార్కెట్ నిర్మాణానికి నిధులను మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు..ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పలు మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారు లు మరియు జిల్ల ఆత్మ కమిటి మెంబర్ కొప్పుల గొవిందరావు మత్కేపల్లి మర్కెట్ డైరెక్టర్ బందెల నాగార్జున చింతకాని ఎఓ మానస ,రైతు సంఘము నాయకులు కొలేటి నాగేశ్వరరావు పాల్గున్నారు

## తహసిల్దార్, ఆర్ఐ ఇద్దరు వీఆర్వోలు సస్పెన్షన్

**మన దునియా,తాడికొండ: మార్చి 15**




తాడికొండ తహసిల్దార్, ఆర్ఐ ఇద్దరు వీఆర్వోలు సస్పెన్షన్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాశుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. భూమి మ్యుటేషన్ వ్యవహారంలో నిబంధనలకు విరుద్ధంగా, లోపబోయిష్టంగా చేపట్టడం పట్ల విచారణ చేపట్టి తహసిల్దార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ తో సహా ఇద్దరు వీఆర్వోలను సస్పెన్షన్ చేశారు. ఇటువంటి తప్పులు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సంఘటనతో హెచ్చరించారు. ఇందులో భాగంగా తహసిల్దార్ పి. మెహర్ కుమార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఎన్.హనుమంతరావు, తాడికొండ – 3 స్వర్ణ గ్రామం గ్రామ రెవెన్యూ అధికారి టి.బ్రహ్మయ్య, తాడికొండ – 4 స్వర్ణ గ్రామం గ్రామ రెవెన్యూ అధికారి జి.రాంబాబులను సస్పెన్షన్ చేశార్లు

## నమ్మకం లేకపోతే ఏ బంధం నిలవదు..!



వివాహ జీవితం సుఖంగా సాగాలంటే ప్రేమ, గౌరవం, నమ్మకం, క్షమ, సానుభూతి వంటి విలువలతో నిండిన అనుబంధం కావాలి. ఇందుకు సద్గురు ఇచ్చిన మార్గదర్శకాలు ఎంతో ఉపయోగపడతాయి. ఈ విలువలు జీవిత భాగస్వాముల మధ్య బంధాన్ని బలపరచడమే కాకుండా.. జీవితాన్ని సంతోషంగా జీవించడానికి ఉపయోగపడతాయి. వివాహం అనేది కేవలం ఒక సంప్రదాయ సంబంధం కాదు. సద్గురు ఏం చెబుతున్నారో తెలుసా..? వివాహం అనేది మన జీవితంలో మనకు తోడుగా ఉండే వ్యక్తిని ఎంచుకోవడమే. శారీరక, భావోద్వేగ, మానసిక, ఆర్థిక, సామాజిక అవసరాలను పూరించగల వ్యక్తి జీవిత భాగస్వామిగా ఉండాలి. ఈ బంధం నిశ్చలంగా నిలవాలంటే దానికి శ్రద్ధ అవసరం. ఏ బంధమైనా రోజురోజుకూ మారుతూ ఉంటుంది. మనం నిర్లక్ష్యం చేస్తే దూరమవుతుంది. కాబట్టి మన జీవిత భాగస్వామితో అనుబంధాన్ని ప్రేమగా, శ్రద్ధగా చూసుకోవాలి. ఒక మంచి వివాహ బంధానికి ముఖ్యమైన అంశం సంభాషణ. మనసులో ఉన్న విషయాలను బహిరంగంగా చెప్పుకోవడం ద్వారా భావోద్వేగాలు సమతుల్యతలో ఉంటాయి. ఇది ఇద్దరినీ దగ్గర చేస్తుంది. అలాగే ఒకరినొకరు గౌరవించడం కూడా ఎంతో అవసరం. వివాహం వల్ల మన వ్యక్తిత్వాన్ని కోల్పోవాల్సిన పని లేదు. ప్రతి వ్యక్తికీ తన సొంత అభిప్రాయాలు ఉంటాయి. అవి భిన్నంగా ఉన్నా.. గౌరవించాలి. ఆ గౌరవం బంధాన్ని నిలబెట్టే శక్తిగా ఉంటుంది.ఇక నమ్మకం గురించి చెప్పాలంటే.. అది లేకుండా ఎలాంటి సంబంధం నిలవదు. భర్తా భార్యల మధ్య పరస్పర నమ్మకం పెరిగేలా మాట్లాడుకోవాలి. ఒకరి నమ్మకాన్ని మరొకరు దెబ్బతీయకుండా జాగ్రత్త పడాలి. నమ్మకమే బంధాన్ని బలంగా ఉంచుతుంది. వివాహం అనగా ఒకరి ప్రపంచంలో మరొకరిని కలిపేసుకోవడం కాదు. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగతంగా ఎదిగే అవకాశం ఉండాలి. కొన్ని విషయాల్లో స్వేచ్ఛ ఇవ్వడం ద్వారా బంధం మరింత ఆరోగ్యంగా మారుతుంది. మానవ సంబంధాల్లో మనుషుల మధ్య అంచనాలు, అబద్ధాలు, అపార్థాలు సాధారణం. అప్పుడు క్షమించగలగడం ఎంతో అవసరం. చిన్నచిన్న సమస్యల్ని పట్టుకొని బంధాన్ని బలహీనంగా మార్చుకోవద్దు. వ్యక్తిగత లక్షణాలను అంగీకరించగలగడం ద్వారా మన హృదయంలో దయ, ప్రేమ పెరుగుతుంది. మన భాగస్వామిలో ఉన్న అసంపూర్ణతలను అంగీకరించగలగడం ద్వారా జీవితం మరింత సులభంగా సాగుతుంది. జీవిత భాగస్వామి చేసిన పనుల్ని బాధ్యతగా కాకుండా ప్రేమతో చూసుకోవాలి. మనకు చేయబడ్డ సహాయానికి కృతజ్ఞత చూపడం ద్వారా బంధం బలపడుతుంది. భార్యా భర్తలు ఒకే ఇంట్లో ఉన్నా.. కొన్ని ప్రత్యేకమైన సందర్భాలు కలిసి గడపడం అవసరం. కలిసి విహారయాత్రలు, భోజనాలు, లేదా మంచి సమయాన్ని గడపడం ద్వారా ప్రేమ మరింత పెరుగుతుంది. ఈ ప్రయాణంలో నవ్వు ఎంతో కీలకమైనది. ఒకరితో ఒకరు నవ్వుతూ మాట్లాడుకోవడం వల్ల మధ్యలో ఉండే ఒత్తిడులు పోతాయి. ఈ విధంగా సాన్నిహిత్యం పెరుగుతుంది. సద్గురు చెప్పిన ఈ సూచనలు వివాహ బంధాన్ని ప్రేమతో, శాంతితో నింపడానికి చాలా ఉపయోగపడతాయి. ఈ బంధం సాధారణంగా ఉండకూడదంటే, ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకునే మనసుతో, పరస్పర గౌరవంతో, క్షమించగల స్వభావంతో జీవించాలి. ఇలాంటి విలువలు ఉన్నప్పుడు మాత్రమే ఈ అనుబంధం బలంగా మారుతుంది.

## మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే



శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు. పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది.పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి.గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ పండు శరీరానికి అవసరమైన ఎనర్జీ అందించే ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఇది శరీరంలోని వ్యర్థ పదార్థాలను వెలుపలికి పంపడంలో సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించడానికి అవకాడో ఉపయోగపడుతుంది. ఆస్పరాగస్‌లో ఫైబర్, ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది.గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.

# అభిషేక్ క్రేజ్ చూసి మాకు అసూయ వేసేది: సంజు శాంసన్




టీ20 ప్రపంచకప్ 2026ను ముద్దాడిన ఆనందంలో ఉన్న టీమిండియా సభ్యులు తమ అనుభవాలను పంచుకుంటున్నారు. 'ఇండియా టుడే కాన్‌క్లేవ్'లో పాల్గొన్న సంజూ శాంసన్, తన ఓపెనింగ్ భాగస్వామి అభిషేక్ శర్మపై ప్రశంసలు కురిపిస్తూనే ఒక సరదా నిజాన్ని బయటపెట్టారు. జట్టులో అభిషేక్‌కు ఉన్న క్రేజ్ చూసి తామంతా ఒకానొక సమయంలో అసూయపడ్డామని నవ్వుతూ చెప్పుకొచ్చారు. "అభిషేక్ ఇప్పుడు టీమిండియాకు అసలైన సూపర్ స్టార్. మేము ఎక్కడికి వెళ్లినా, బస్సును ఫ్యాన్స్ చుట్టుముట్టి 'అభిషేక్.. అభిషేక్..' అని అరుస్తుంటే మాకు ఆశ్చర్యం వేసేది. అందరూ ఇతన్నే చూస్తున్నారా? మమ్మల్ని ఎవరూ గమనించడం లేదా? అని జట్టులోని కుర్రాళ్లం ఒకరి మొహాలు ఒకరం చూసుకుని సరదాగా ఈర్ష్య పడేవాళ్లం" అని సంజూ పేర్కొన్నాడు. అభిషేక్ వ్యక్తిత్వం, అతడు ఆటను ఆస్వాదించే తీరు అందరికీ ఇష్టమని చెప్పాడు. సంజూ-అభిషేక్ జోడీని సాధారణంగా 'ఐస్ అండ్ ఫైర్' (ఒకరు కూల్, ఒకరు అగ్రెసివ్) అని పిలుస్తుంటారు. కానీ సంజూ దీనిని విభేదిస్తూ.. "మేము ఐస్ అండ్ ఫైర్ కాదు, 'ఫైర్ అండ్ ఫైర్' (మంటకు మంట). ఒకవేళ అతడు తగ్గితే నేను బాదుతాను, నేను తగ్గితే అతడు విరుచుకుపడతాడు. మా ఇద్దరి మధ్య కేరళ-పంజాబీ బంధం చాలా బలంగా ఉంది. క్రీజులో మా మధ్య కమ్యూనికేషన్ చాలా సింపుల్‌గా ఉంటుంది. బంతి ఎలా వస్తుందని అతడు అడిగితే.. 'బానే వస్తోంది, సిక్సర్ కొట్టు' అని నేను చెబుతాను. అంతా చాలా నేచురల్ గా జరిగిపోతుంది" అని వివరించారు.అహ్మదాబాద్‌లో జరిగిన టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో న్యూజిలాండ్‌పై భారత్ 255 పరుగుల భారీ స్కోరు చేయడంలో ఈ జోడీ పాత్ర మరువలేనిది. పవర్ ప్లేలోనే 98 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి కివీస్ బౌలర్లను వణికించారు. ఈ మ్యాచ్‌లో సంజూ 89 పరుగులు చేయగా, అభిషేక్ కేవలం 21 బంతుల్లోనే 52 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. ముగింపులో సంజూ సరదాగా ఒక సలహా ఇస్తూ.. "భాయ్.. ఇక నువ్వు త్వరగా పెళ్లి చేసేసుకో" అంటూ అభిషేక్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించాడు.

# సన్‌రైజర్స్‌కు షాక్.. 'ది హండ్రెడ్' నుంచి పాక్ స్పిన్నర్ అవుట్?

బ్రిటన్ వేదికగా జరిగే 'ది హండ్రెడ్' (ఌష్టవ ఎబఅసతీవస) టోర్నీలో సన్‌రైజర్స్ జట్టుకు ఊహించని చిక్కులు వచ్చి పడ్డాయి. పాకిస్థాన్ మిస్టరీ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌ను ఈ ఫ్రాంచైజీ భారీ ధరకు కొనుగోలు చేసినప్పటికీ ప్రస్తుతం వస్తున్న వ్యతిరేకత నేపథ్యంలో అతడు బరిలోకి దిగడంపై సందిగ్ధత నెలకొంది. ఐపీఎల్‌లో 'సన్‌రైజర్స్ హైదరాబాద్' (ూ=ఎ), దక్షిణాఫ్రికా లీగ్‌లో 'సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్' జట్లను నడుపుతున్న యాజమాన్యమే ఈ ఫ్రాంచైజీని కూడా నిర్వహిస్తోంది. లండన్‌లో ఆదివారం జరిగిన వేలంలో అబ్రార్ అహ్మద్‌ను సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ ఏకంగా 1,90,000 పౌండ్లకు (సుమారు రూ. 2.34 కోట్లు) సొంతం చేసుకుంది. అయితే, భారతీయ మూలాలున్న సన్‌రైజర్స్ యాజమాన్యం ఒక పాకిస్థాన్ ఆటగాడిని ఇంత భారీ ధరకు కొనుగోలు చేయడంపై సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అతడు జట్టులో కొనసాగుతాడా లేదా అన్న చర్చ మొదలైంది.అబ్రార్ ఎంపికపై వస్తున్న విమర్శల నేపథ్యంలో ఫ్రాంచైజీ యాజమాన్యం పునరాలోచనలో పడినట్లు సమాచారం. ఒకవేళ నిరసనలు తీవ్రమైతే, టోర్నీ ప్రారంభానికి ముందే అతడిని తప్పించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ వివాదంపై అటు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు గానీ, ఇటు సన్‌రైజర్స్ యాజమాన్యం గానీ ఇంకా అధికారికంగా స్పందించలేదు.



# రహస్యంగా పెళ్లి చేసుకున్న క్రికెటర్ యశ్ దయాళ్... వధువు ఎవరంటే...!




రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) పేస్ బౌలర్ యశ్ దయాళ్ ఓ ఇంటివాడయ్యాడు. సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్ శ్వేత పుండిర్‌ను వివాహం చేసుకున్నాడు. గత నెలలోనే వీరి పెళ్లి జరిగినప్పటికీ, ఈ విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది.మీడియా కథనాల ప్రకారం, వీరి వివాహం ఫిబ్రవరి 4న ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో జరిగింది. ఈ వేడుకకు కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. ఈ జంట తమ పెళ్లి విషయాన్ని సోషల్ మీడియాలో అధికారికంగా ప్రకటించలేదు. అయితే, దయాళ్ తో ఉన్న కొన్ని క్షణాలను శ్వేత తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో రూపంలో పంచుకున్నారు. ఢిల్లీకి చెందిన శ్వేత పుండిర్ ఒక సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, వ్లాగర్‌గా గుర్తింపు పొందారు. ఆమెకు ఇన్‌స్టాలో 5.87 లక్షల మందికి పైగా ఫాలోవర్లు ఉన్నారు.లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌గా యశ్ దయాళ్ ఐపీఎల్‌లో మంచి పేరు తెచ్చుకున్నాడు. 2022లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడి, ఆ జట్టు టైటిల్ గెలవడంలో భాగమయ్యాడు. ఆ తర్వాత 2024 సీజన్‌లో ఆర్సీబీకి మారాడు. గత ఏడాది ఆర్సీబీ తొలిసారి ఐపీఎల్ టైటిల్ గెలుచుకోవడంలోనూ దయాళ్ కీలక పాత్ర పోషించాడు.మార్చి 28న ప్రారంభం కానున్న ఐపీఎల్ 2026 సీజన్ కోసం ఆర్సీబీ యాజమాన్యం అతడిని అట్టిపెట్టుకుంది. ఈ సీజన్‌లో టైటిల్ డిఫెండింగ్ లక్ష్యంతో బరిలోకి దిగుతున్న ఆర్సీబీకి దయాళ్ సేవలు కీలకం కానున్నాయి. మార్చి 28న చిన్నస్వామి స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఆర్సీబీ తమ తొలి మ్యాచ్ ఆడనుంది. కాగా, యశ్ దయాళ్ పై జైపూర్ లో లైంగిక వేధింపుల కేసు నమోదు కావడం గతంలో సంచలనం సృష్టించింది. యశ్ దయాళ్ తనను హోటల్ కు పిలిచి లైంగిక దాడి చేశాడని 17 ఏళ్ల అమ్మాయి తీవ్ర ఆరోపణలు చేసింది. క్రికెట్ లో మంచి కెరీర్ అందిస్తానని హామీ ఇచ్చి, రెండేళ్లు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఆమె వెల్లడించింది. దాంతో అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

# అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పిన పాకిస్థాన్ మాజీ కెప్టెన్

పాకిస్థాన్ మాజీ కెప్టెన్, వికెట్ కీపర్ బ్యాటర్ సర్ఫరాజ్ అహ్మద్ తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు ముగింపు పలికాడు. సుమారు రెండు దశాబ్దాల పాటు సాగిన తన ప్రయాణానికి ఆదివారం వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించాడు. 2017లో సర్ఫరాజ్ సారథ్యంలోనే పాకిస్థాన్ జట్టు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకోవడం విశేషం. 37 ఏళ్ల సర్ఫరాజ్ పాకిస్థాన్ తరఫున 54 టెస్టులు, 117 వన్డేలు, 61 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి 6,164 పరుగులు చేశాడు. ఇందులో 6 సెంచరీలు, 35 అర్ధ సెంచరీలు ఉన్నాయి. వికెట్ కీపర్‌గా 315 క్యాచ్‌లు, 56 స్టంపింగ్‌లతో సత్తా చాటాడు. జూనియర్, సీనియర్ స్థాయిలో ఐసీసీ టైటిళ్లు గెలిపించిన ఏకైక కెప్టెన్‌గా సర్ఫరాజ్ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. 2006లో అతడి నాయకత్వంలోని అండర్-19 జట్టు ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్‌ను ఓడించి టైటిల్ గెలిచింది. సర్ఫరాజ్ కెప్టెన్సీలో పాకిస్థాన్ జట్టు టీ20 ఫార్మాట్‌లో అగ్రస్థానానికి చేరడంతో పాటు వరుసగా 11 సిరీస్‌లు గెలిచి ప్రపంచ రికార్డు సృష్టించింది. బాబర్ అజామ్, షహీన్ అఫ్రిది, హసన్ అలీ, ఫఖార్ జమాన్ వంటి స్టార్ ఆటగాళ్లు అతడి కెప్టెన్సీలోనే వెలుగులోకి వచ్చారు. "పాకిస్థాన్ తరఫున ఆడటం నా జీవితంలో దక్కిన గొప్ప గౌరవం. జట్టును అన్ని ఫార్మాట్లలో నడిపించాలన్న నా కల నెరవేరింది. నా ఎదుగుదలకు సహకరించిన సహచరులకు, కోచ్‌లకు, అభిమానులకు కృతజ్ఞతలు" అని సర్ఫరాజ్ తన ప్రకటనలో పేర్కొన్నాడు. 2007లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన సర్ఫరాజ్, తన చివరి మ్యాచ్‌ను 2023లో ఆస్ట్రేలియాపై ఆడాడు. ప్రస్తుతం అతను పాకిస్థాన్ షహీన్స్, అండర్-19 జట్లకు మేనేజర్, మెంటార్‌గా వ్యవహరిస్తున్నాడు. కాగా, మైదానంలో బద్ధకంగా ఉంటాడని సర్ఫరాజ్ పలు పర్యాయాలు విమర్శలు ఎదుర్కొన్నాడు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



## నిర్మాతగా నేను పూర్తిగా నష్టపోయా: విజయ్ సేతుపతి

సాధారణంగా సినీ పరిశ్రమలో తమ వైఫల్యాలను దాచుకోవాలని చూసే వారు ఎక్కువగా ఉంటారు. కానీ తమిళ నటుడు విజయ్ సేతుపతి మాత్రం తాను నిర్మాతగా మారి తీసిన సినిమాలన్నీ నష్టాలనే మిగిల్చాయని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. కేవలం లాభాల కోసం కాకుండా, వైవిధ్యమైన కథల మీద ఉన్న మక్కువతోనే తాను సినిమాలు తీశానని ఆయన స్పష్టం చేశారు.నిర్మాతగా విజయ్ సేతుపతి తన ప్రయాణాన్ని 'సంగుతేవన్' అనే చిత్రంతో ప్రారంభించగా, అది మధ్యలోనే ఆగిపోవడంతో సుమారు రూ. 1.75 కోట్ల నష్టం వాటిల్లింది. ఆ తర్వాత ఆయన తన సొంత బ్యానర్‌పై నిర్మించిన ఆరెంజ్ మిఠాయి, మేర్కు తోడర్చి మలై, జుంగా, లాభమ్ వంటి చిత్రాలు విమర్శకుల ప్రశంసలు అందుకున్నప్పటికీ, ఆర్థికంగా మాత్రం ఆయనకు చేదు అనుభవాన్నే మిగిల్చాయి. అయినప్పటికీ, మనసుకు నచ్చిన కథలను వెండితెరకు పరిచయం చేశానన్న తృప్తి తనకు ఉందని, ఆ సినిమాల విషయంలో తనకు ఎలాంటి పశ్చాత్తాపం లేదని ఆయన చెప్పుకొచ్చారు. నిర్మాతగా ఎదురైన ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూనే, ప్రస్తుతం ఆయన డిజిటల్ రంగంలోకి అడుగుపెట్టారు. విజయ్ సేతుపతి నిర్మాణంలో రూపుదిద్దుకున్న 'కాట్టాన్' అనే వెబ్ సిరీస్ త్వరలో డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో విడుదల కానుంది.

## ఈసారి నేరుగా నుదిటిపై షూట్ చేస్తాం.. ప్రముఖ బాలీవుడ్ సింగర్ కు బిష్ణోయ్ గ్యాంగ్ వార్నింగ్

ప్రముఖ బాలీవుడ్ సింగర్, ర్యాపర్ బాద్‌షాకు గ్యాంగ్ స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠా నుంచి తీవ్రస్థాయిలో బెదిరింపులు వచ్చాయి. హర్యానాలోని పానిపట్‌లో జరిగిన ఒక కాల్పుల ఘటనకు బాధ్యత వహిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన ఈ గ్యాంగ్.. అదే పోస్ట్‌లో బాద్‌షాను హెచ్చరించింది. "బాద్‌షా.. నువ్వు హర్యానా సంస్కృతిని చెడగొట్టడానికి ప్రయత్నిస్తున్నావు. 2024లో నీ క్లబ్ వద్ద జరిగిన పేలుడు కేవలం ఒక ట్రైలర్ మాత్రమే. ఈసారి నేరుగా నీ నుదుటిపైనే కాల్పులు జరుపుతాం" అంటూ 'రణదీప్ మాలిక్ - అనిల్ పండిట్' పేరుతో ఉన్న ఖాతా నుంచి ఈ బెదిరింపులు వెలువడ్డాయి.ప్రస్తుతం బాద్‌షా 'టటీరీ' అనే తన హర్యానా పాట విషయంలో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ పాటలోని సాహిత్యం అభ్యంతరకరంగా ఉందంటూ హర్యానా రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బాద్‌షా విచారణకు సహకరించకపోతే అతడిని అరెస్ట్ చేయాలని, అవసరమైతే పాస్ పోర్ట్ ను కూడా జప్తు చేయాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఈ పాట విషయంలో పలు చోట్ల బాద్‌షాపై ఎఫ్ఐఆర్లు కూడా నమోదయ్యాయి. ఈ వివాదం కొనసాగుతుండగానే బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి వచ్చిన ఈ బెదిరింపులు బాలీవుడ్ వర్గాల్లో కలకలం రేపాయి.ఈ నేపథ్యంలో బాద్‌షా స్పందిస్తూ.. తానొక గర్వించదగ్గ హర్యానా వ్యక్తినని, ఎవరినీ అవమానించాలన్నది తన ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. అయితే, 2024 లో బాద్‌షాకు చెందిన చండీగఢ్ నైట్‌క్లబ్ వెలుపల పేలుడు సంభవించిన ఘటనకు కూడా బిష్ణోయ్ ముఠానే బాధ్యత వహించడం గమనార్హం. ప్రస్తుతం ఈ బెదిరింపుల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ దాడులకు పాల్పడిన వారిని గుర్తించేందుకు, బాద్‌షాకు భద్రత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.





## సినిమా అంటే నాకు ప్రాణం... అందుకే దాన్ని ఎప్పటికీ వదల్లేను: పవన్ కల్యాణ్

"నాకు తెలిసిన, నేను చూసిన హీరో ఒక్కరే.. అది అన్నయ్య చిరంజీవి గారే" అంటూ జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. తన అన్నయ్యే తనకు స్ఫూర్తి అని పునరుద్ఘాటించారు. 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్ర గ్లింప్స్‌ను చూసి అభినందిస్తూ చిరంజీవి, రామ్ చరణ్ చేసిన ట్వీట్లకు ఆయన మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో అంగరంగ వైభవంగా జరిగిన చిత్ర ప్రీ-రిలీజ్ వేడుకలో పవన్ ప్రసంగించారు."ఉస్తాద్ భగత్ సింగ్' ప్రీ రిలీజ్ వేడుకకు వచ్చిన, నా గుండెల్లో స్థానం ఉన్న మీ అందరికీ, టీవీలో ఈ కార్యక్రమాన్ని చూస్తున్న తెలుగు ప్రజలందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు. ఈ వేడుకకు మీ ఆశీస్సులు అందించడానికి వచ్చినందుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.ఇందాక సుమా గారు మాట్లాడుతూ నన్ను గతకాలం నాటి హీరో అన్నట్టు మాట్లాడారు. ఈ మధ్యనే 'ఓజీ' వచ్చిందనే విషయాన్ని మీరు మర్చిపోయినట్టున్నారు. నేను రెగ్యులర్‌గా సినిమాలు చేయకపోవడం వల్ల నన్ను ఇలా వెనక్కి నెట్టడం భావ్యం కాదని బల్లగుద్ది మరీ చెబుతున్నాను. సరదాగా అంటున్నాను కానీ, సినిమా అంటే నాకు ప్రాణం. నాకు అన్నం పెట్టింది సినిమా. ఈ రోజు ప్రజలకు సేవ చేసే గుర్తింపును ఇచ్చింది కూడా సినిమానే. అందుకే సినిమాను వదల్లేను. నా నిర్మాతలు, దర్శకులు, రచయితలు బాగుండాలని కోరుకుంటాను. సినిమా కలెక్షన్ల గురించి నేను ఎప్పుడూ పట్టించుకోలేదు. నేను తెలుగు సినిమా, తమిళ సినిమా అని చూడను, భారతీయ చిత్ర పరిశ్రమగానే భావిస్తాను.నా హీరో అంటే ఒకే ఒక్కరు... మెగాస్టార్ చిరంజీవి గారు. అలాంటి అన్నయ్య, ఈ రోజు 'ఉస్తాద్ భగత్ సింగ్' ట్రైలర్ చూసి ట్వీట్ చేసినందుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. అలాగే రామ్ చరణ్, 'పెద్ది' దర్శకులు బుచ్చిబాబు గారికి కూడా ధన్యవాదాలు.ఒక సినిమాను మొదలుపెట్టేటప్పుడు అద్భుతంగా రావాలనే అందరం కోరుకుంటాం. కానీ ఆ తర్వాత ఎన్నో అడ్డంకులు, ఒడిదొడుకులు ఎదురవుతాయి. వాటన్నింటినీ దాటుకుని విజయం సాధించడం చాలా కష్టం. నేను ఒకసారి దర్శకుడిని నమ్మితే, గుడ్డిగా నమ్మేస్తాను. ఏం చేయమంటే అది చేస్తాను. హరీశ్ శంకర్ మొదట ఒక కథ చెప్పారు, కానీ అది ముందుకు వెళ్లలేదు. ఆ తర్వాత కథ మారింది, మధ్యలో కొవిడ్ వచ్చింది, నేను రాజకీయాల్లోకి వెళ్లాను. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక, నా విధులకు ఇబ్బంది కలగకుండా పక్కా ప్రణాళికతో ఈ సినిమా చేశాం. రాత్రింబవళ్లు కూర్చుని కేవలం 40-45 రోజుల్లోనే మేజర్ పార్ట్ షూటింగ్ పూర్తి చేశాను. నిజంగా పక్కా ప్లానింగ్ ఉంటే, రాజకీయ బాధ్యతలు నిర్వర్తిస్తూనే సినిమాలు చేయొచ్చని ఈ సినిమా నాకు భరోసా ఇచ్చింది. ఆ ఘనత దర్శకుడు హరీష్ శంకర్‌దే.ఒక నిర్మాణ సంస్థకు వరుసగా విజయాలు రావడం కాకతాళీయం కాదు. మైత్రీ మూవీ మేకర్స్ వారు తీస్తున్న 'పుష్ప', 'జనతా గ్యారేజ్' వంటి చిత్రాల విజయాల వెనుక వారి కృషి ఎంతో ఉంది. అలాంటి సంస్థలో పనిచేసే అవకాశం వచ్చినందుకు వారికి నా ధన్యవాదాలు. ఈ సినిమా ఇంత బాగా రావడానికి కారణం మీలో ఒకడు దర్శకుడు అయితే ఎలా ఉంటుందో, అలా ఉండే హరీశ్ శంకర్. తెలంగాణ నేల నుంచి వచ్చిన ఈ దర్శకుడికి హద్దుల్లేవు. 'గబ్బర్ సింగ్' సమయంలో నాకు హార్స్ రైడింగ్ రాకపోయినా, గుజరాత్‌లో గుర్రం మీద నన్ను నడిపించాడు. ఒక నటుడి నుంచి అత్యుత్తమ ప్రదర్శన రాబట్టడానికి తను పడే తపన అలాంటిది. అనవసరమైన కాంట్రవర్సీలకు వెళ్లొద్దని నేను చెబుతుంటాను. ఎందుకంటే తను ఇచ్చిపడేసే గోత్రం అయితే, నేను దెబ్బలు తీసుకునే రకం. అలాంటి వ్యక్తి మన తెలంగాణ గడ్డకు, దేశానికి భవిష్యత్తులో ఎంతగానో సేవ చేస్తాడన్న నమ్మకం నాకుంది.ఈ సినిమాలో నటించిన శ్రీలీల గారు అద్భుతంగా నటించారు. తన పాత్ర ఇప్పటివరకు తను చేసిన అన్ని పాత్రల్లో గుర్తుండిపోతుంది. కేవలం నా మీద నమ్మకంతో కథ కూడా వినకుండా నటించడానికి వచ్చిన రాశీ ఖన్నా గారికి, అలాగే సీనియర్ నటులు కేఎస్ రవికుమార్ గారికి, పార్థిబన్ గారికి నా ప్రత్యేక ధన్యవాదాలు.ఈ సినిమా 'గబ్బర్ సింగ్' అంతటి విజయం సాధించాలని కోరుకుంటున్నాను. అయితే, తుది తీర్పు ఎప్పుడూ ప్రజలదే. మా వంతుగా మేమందరం మా బెస్ట్ ఎఫర్ట్ పెట్టాం. ఆంధ్రప్రదేశ్‌లో ఏ హీరో సినిమా అయినా, అది 'పుష్ప' అయినా, ఎన్టీఆర్ గారి సినిమా అయినా, 'కల్కి' అయినా... అందరి సినిమాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఎవరూ దేహీ అని అడగాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఇది మన భారతీయ సినిమా. ఫ్యాన్ వార్స్ వదిలేసి అందరినీ గౌరవించుకుందాం.చివరగా ఒకటి చెప్పాలనుకుంటున్నాను. మీరు లేకపోతే పవన్ కల్యాణ్ లేడు. మీకూ నాకూ మధ్య దూరం కేవలం రెండు గుండెల దూరమే. సినిమాలోని డైలాగ్‌లా "ఇచ్చిపడేసే గోత్రం, ఇరగతీసే నక్షత్రం" అని నేను చెప్పలేను. నేను చెప్పగలిగేది ఒక్కటే.. "మిమ్మల్ని ప్రేమించే గోత్రం, సేవ చేసే నక్షత్రం" నాది. ఈ అవకాశం ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వానికి, పోలీసు శాఖకు, మీ అందరికీ మరోసారి ధన్యవాదాలు. ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు. జై హింద్" అంటూ పవన్ కల్యాణ్ తన ప్రసంగం ముగించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2O23/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com